ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 46 | శుక్రవారం 14 నవంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +


మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...
బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715

# 82 వేల కోట్ల పెట్టుబడులతో రీన్యూ పవర్




## సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రీన్యూ పవర్, తైవాన్ సంస్థల ఎంఓయూలు

**విశాఖపట్నం, నవంబర్ 13 :**

భాగస్వామ్య సదస్సు కంటే ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. మంత్రి లోకేష్ ప్రకటించినట్లు ఇంధన రంగంలో రీన్యూ పవర్ సంస్థ భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా విశాఖలో ఏపీ ప్రభుత్వంతో రీన్యూ పవర్ గురువారం ఒప్పందం చేసుకుంది. రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రీన్యూ పవర్ సంస్థ ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈడీబీతో రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలను రీన్యూ పవర్ సంస్థ ప్రతినిధులు కుదుర్చుకున్నారు. ఇవి కాకుండా గతంలోనే రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు రీన్యూ పవర్ ముందుకు వచ్చింది. పునరుత్పాదక శక్తి, సోలార్ తయారీ, బ్యాటరీ స్టోరేజ్,పంప్డ్ హైడ్రో, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో రీన్యూ పవర్ సంస్థ పెట్టుబడులు పెడుతోంది. ఒప్పందంలో భాగంగా 6 జీడబ్ల్యూ పీవీ ఇంగోట్-వేఫర్ ప్లాంట్ జీడబ్ల్యూ పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్

మిగతా 2 లో

## విజయవంతంగా
# క్రెడిట్ చోరీ

### ఇళ్ల పథకంలో క్రెడిట్ చోరీ స్కీమ్
### 18 నెలల కాలంలో ఒక్క గజం కేటాయింపు ఏదీ
### ఎక్స్ వేదికగా వైకాపా నేత జగన్ విమర్శలు



**తాడేపల్లి, నవంబర్ 13 :**

ఏపీ సిఎం చంద్రబాబు కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుందని వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్క సెంటు స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇళ్ళ కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని, ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ 'ఇళ్లన్నీ మేమే కట్టేశాం' అంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' హేయంగా ఉందని పేర్కొన్నారు. తాము ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదని తెలిపారు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు తమ హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవేనని జగన్ పేర్కొన్నారు. మరో 87,380 ఇళ్లు శ్లాబ్ లెవల్ వరకూ గత ప్రభుత్వ హయాంలోనే కట్టించినవేనని తెలిపారు. ఇవికాక అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లలో ఒకేరోజు గృహప్రవేశాలతో గత ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, ఇన్ని వాస్తవాలు కళ్ళముందే ఉన్నా?అసలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, అన్నీ ఈ ప్రభుత్వమే చేసినట్టుగా పచ్చి అబద్దాలను ప్రచారం చేస్తున్న చంద్రబాబు క్రెడిట్ చోరీ స్కీం చాలా హేయమని జగన్ ఆగ్రహించారు.మా హయాంలో 71.8 వేల ఎకరాల్లో 31.19 (మిగతా 2లో)

# ఫ్రీ ప్రయాణ నిధులు

### ఆర్టీసికి రూ 400ల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



**అమరావతి, నవంబర్ 13 :**

సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని గత ఆగస్టు నెల నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకూ ఈ పథకానికైన ఖర్చును ఏపీఎస్ ఆర్టీసీకి చెల్లిస్తూ కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. మహిళల జీరో ఫేర్ టికెట్ల ఖర్చుకు సంబంధించిన రూ.400 కోట్ల అదనపు నిధులు విడుదల (మిగతా 2లో)

## విశాఖలో ట్రేడ్ సెంటర్‌కు
# లోకేష్ భూమి పూజ

### వేలాదిమందికి ఉద్యోగావకాశాలు వస్తాయని వెల్లడి



**విశాఖపట్నం, నవంబర్ 13 :**

విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకు స్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యో గాలు లభించ ´నున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్‌లు కార్యక్రమంలో పాల్గొ న్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్స్‌లెన్స్ (మిగతా 2లో)

# రబీ సాగుకు నీరు

### వైవీఆర్ ప్రాజెక్టు నుండి కొడవాండ్లపల్లి చెరువుకు నీటి విడుదల
### రైతన్నల్లో వెల్లివిరిసిన ఆనందం



**ముదిగుబ్బ, నవంబర్ 13 :**

శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ (వైవిఆర్) కుడి కాలువ ద్వారా గురువారం కొడవాండ్లపల్లి చెరువుకు నీటి విడుదల చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు కలిసి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదిలారు.కొడవండ్లపల్లి పరిసర ప్రాంతాల్లో బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో, రబి సాగు కష్టసాధ్యమవుతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. దీనిపై ఆ ప్రాంతవాసులు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లకు వినతులు సమర్పించారు.వారి విజ్ఞప్తిపై వెంటనే (మిగతా 2లో)

## నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు...
## ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఫలిస్తాయా..
## మరోమారు నితీశ్ సిఎం అయ్యేనా..



# పర్తిలో పోలీస్ నిఘా

- శ్రీ సత్యసాయి శతజయంతికి అడుగడుగునా పోలీస్..
- హాజరు కానున్న ప్రధాని, రాష్ట్రపతి, సిఎంలు...
- పుట్టపర్తిలో భారీ బందోబస్తు, ప్రత్యేక నిఘా...
- అణువణువునా తనిఖీలు..
- ఢిల్లీ సంఘటనతో మరింత అప్రమత్తం..
- డ్రోన్‌లు, కెమెరాలతో ప్రత్యేక పర్యవేక్షణ....



**పుట్టపర్తి, నవంబర్ 13 :**

భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి మహోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈనెల 19వ తేదీన ప్రధాని మోడీ, 22వ తేదీ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, 23న ఉపరాష్ట్రపతి రాధాక్రిష్ణన్‌తో పాటు పలు రాష్ట్రాల సిఎంలు హాజరు కానున్నారు. అదేవిధంగా ప్రపంచ దేశాల నుంచి పలువురు వీవీఐపీలు, ప్రముఖులు హాజరు కానున్నారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహిస్తోంది. దేశంలోని ప్రముఖులు, విదేశాల నుంచి హాజరు అవుతుండటంతో వారు వచ్చి వెళ్లే వరకు ఎటువంటి అవాంతరాలు జరగకుండా పోలీస్ పహారా కాస్తోంది. ఢిల్లీలో జరిగిన బాంబు దాడిని దృష్టిలో పెట్టుకుని మరింత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ స్వయంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తూ ఇతర పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా హాజరవ్వుతున్న భక్తాదుల వస్తు సామాగ్రిని, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ ముమ్మర తనిఖీలు కొనసాగిస్తున్నారు. పట్టణంలోకి హాజరయ్యే ప్రతి ఒక్కరి వివరాలు కెమెరాల్లో నమోదు అవుతున్నాయి. గ్రేహౌండ్స్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబుస్క్వాడ్ తనిఖీలను (మిగతా 2లో)

## అటవీశాఖ భూముల
# ఆక్రమణ

### పెద్దిరెడ్డిపై పవన్ ఆరోపణలతో హాట్ టాపిక్
### సర్వత్రా ఇదే అంశంపై చర్చ



**అమరావతి, నవంబర్ 13 :**

అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిపై డిప్యూటి సిఎ పవన్ కళ్యాణ్ చేసిన అటవీ భూ ఆక్రమణ ఇప్పుడు సంచల నంగా మారింది. సర్వత్రా ఇప్పుడు ఇదే అంశంపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గామారింది. అలాగే దీనిపై పెద్ది రెడ్డి తనయుడు, ఎంపి మిథున్ రెడ్డి ఘాటుగా స్పందించారు. దీనిని రుజువు చేయాలన్నారు. శేషాచల (మిగతా 2లో)

# ఉల్లి రైతుకు తీరని నష్టం

- దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు ఆగని కన్నీరు...
- కొనుగోలు ధరలు పెరిగినా గిట్టుబాటు మృగ్యం...
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఆందోళన....
- మార్కెట్‌లకు తీసుకెళ్తే రవాణా ఖర్చులూ దండగే..
- పొలాల్లోనే పంటను వదిలేస్తున్న రైతన్నలు...
- ధర... రూ 1, 2 లే



**న్యూ ఢిల్లీ, నవంబర్ 13 :**

దేశవ్యాప్తంగా ఉల్లి పంట పండించిన అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, కొనడానికి అధికధరలు వెచ్చించి ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు.ఎపిలో కర్నూలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం హడావిడి చేసినా రైతులకు ఒరిగిందేమీ లేదు. చాలా చోట్ల రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లితే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని, పొలాల్లోనే వాటిని వదిలేస్తున్నారు. కొన్ని మాసాల నుంచే అక్కడి రైతులు మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనేవుంది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో కిలో ఉల్లి మాత్రం 30కి పైనే అమ్ముతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇప్పటికే పాత ఉల్లి పంట (మిగతా 2లో)

# 82 వేల కోట్లతో రీన్యూ పవర్



(మొదటి పేజి (తరువాయి)

సిస్టమ్ వంటి వాటిల్లో 5 జీడబ్ల్యూ హైబ్రిడ్ ప్రాజెక్టులను రీన్యూ పవర్ ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధికి అవకాశం లభించనుంది. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టును అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు రీన్యూ పవర్ అంగీకారం తెలిపింది. గత ప్రభుత్వంలో రాష్ట్రం వీడి వెళ్లిన కంపెనీలు తిరిగి భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేష్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. లోకేష్ ట్వీట్ చేసిన ప్రకటనపై విశాఖలో సీఐఐ సమ్మిట్‌కు ముందు రీన్యూ పవర్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది.

## 400 కోట్లతో తైవాన్ సంస్థ

విశాఖపట్నం సీఐఐ పార్టనర్ షిప్ కన్నా ముందే సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తైవాన్ కంపెనీలతో రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుందని సీఎం తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్ర పారిశ్రామికవృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 400 కోట్ల రూపాయిలతో కుప్పంలో 470 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తుందని.. దీని వలన 50 వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. మిజోలి ఇండియా జెవి, మిజోలి యూఎస్ఏ, క్రియేటివ్ సెన్సోర్ (తైవాన్), సినేస్టి టెక్నాలజీలు 23 జిడబ్ల్యూహెచ్ ఫ్రికర్సర్ ఫ్రి సింగిల్ క్రిస్టర్ క్యాతోడ్ యాక్టివ్ మెటీరియల్, సాలిడ్ స్టేట్ ఎలక్ట్రోలైట్ మ్యానిఫ్యాక్చరింగ్ ఫేసిలిటిని ఓర్వకల్లు, కర్నూలులో రూ.18 వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటివల్ల 2 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ అవగాహన ఒప్పందాలు స్వర్ణాంధ్రా విజన్ 2047 సాధించడంలో కీలక భూమిక పోషిస్తాయని... వికాసిత్ భారత్ వైపు నడిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖకు వచ్చిన తైవాన్ బృందం సీఎంతో భేటీ అయింది. తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని బృందం చంద్రబాబును కలిసింది. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని తైవాన్ బృందానికి సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో-తైవాన్ ఇండస్ట్రియల్ పార్కును కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు సిద్ధమని సీఎంకు వెల్లడించింది.

# అటవీ భూముల ఆక్రమణ

(మొదటి పేజి (తరువాయి)

అటవీ ప్రాంతంలో భూకబ్జాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన బహిరంగ ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. జనసేన పార్టీ 'బిగ్ ఎక్స్‌పోజ్'గా ప్రచారం చేసిన ఈ విషయం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. పవన్ కళ్యాణ్ ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా.. మంగళంపేట అటవీ ప్రాంతంలోని అక్రమ ఆక్రమణలపై స్వయంగా పరిశీలన చేశారు. ఆయన ఏరియల్ వ్యూ వీడియోలు, మ్యాపింగ్‌లు, ఉపగ్రహ చిత్రాలతో కూడిన ఆధారాలను విడుదల చేశారు. ఈస్ట్ ఘాట్స్ పరిధిలోని రక్షిత అటవీ భూముల్లో సుమారు 76.74 ఎకరాల భూకబ్జా జరిగినట్లు అందులో పేర్కొన్నారు. ఈ భూములు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సంబంధించినవని పవన్ కళ్యాణ్ తన 'ఎక్స్' ఖాతా పోస్టులో తెలిపారు. ఈ ఘటనపై పవన్ కళ్యాణ్ సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమర్పించారు. రక్షిత అటవీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరగడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ దానిపై దర్యాప్తు అవసరమని సూచించారు. ఇకపోతే అడవి మధ్యలో ఉన్న భూమి అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి వారసత్వంగా ఎలా వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. భూమి ఎప్పుడు చేతులు మారిందో తెలుసుకోవాలని, దీనిలో ఎవరి పాత్ర ఎంతనే దానిపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 104 ఎకరాల అటవీ భూములపై పవన్‌కల్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. మంగళంపేటలో సర్వే నంబర్లు 295, 296లో అసలు భూమి విస్తీర్ణం ఎంత, అది కాలానుగుణంగా ఎలా పెరిగిందనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లు సబ్ డివిజన్ చేసి అటవీ భూములను ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా ఎలా జరిగిందనే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. రక్షిత అటవీ భూముల్లో ఆస్తులు కబ్జా చేసి ఎస్టేట్‌లు నిర్మించిన వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకెళ్లాలి. భూములు ఆక్రమించిన వారి వివరాలు అటవీశాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలి. వారిపై కేసులు ఏ స్థితిలో ఉన్నాయనే వివరాలు ప్రజలకు తెలియాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో అటవీ భూములపై అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. భూ రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 40.80 ఎకరాలు వారి ఆధీనంలో ఉంటే.. వెబ్‌ల్యాండ్‌లోకి వచ్చే సరికి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది పరిశీలించాలన్నారు. మంగళంపేట అటవీ భూముల ఆక్రమణపై విజిలెన్స్ నివేదిక ఎంతో కీలకం. పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన భూముల పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు

**పాట్నా, నవంబర్ 13 :**

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బిహార్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సీఎం నితీశ్ కుమార్ తన అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేదా? అనేది నేటితో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం మళ్లీ ఎన్‌డిఎ గెలుస్తుందని ప్రకటించారు. అయితే దీనిని తేజస్వియాదవ్ కొట్టి పారేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసి రికార్డు నెలకొల్పిన నితీశ్ కుమార్ ఈసారి గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టించిన వారవుతారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల సంఘం ఇటీవల తెలిపింది. కౌంటింగ్ సెంటర్లలో రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించింది. మొదటి భద్రతా వలయంలో కేంద్ర పారామిలిటరీ దళాలు, ఆ తరువాత రాష్ట్ర పోలీసు బలగాలతో పహారాను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 24/7 సీసీటీవీ నిఘా కూడా ఉంటుందని వెల్లడించింది. ఇక ఓట్లు భద్రపరిచిన ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్ వద్ద జిల్లా సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎలక్షన్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు స్టాం÷-రగ్ రూమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ భారీ స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఓటింగ్ నిర్వహించగా రికార్డు స్థాయిలో 67.13 శాతం మేర పోలింగ్ జరిగింది. దీంతో, ప్రజాతీర్పుపై ఉత్కంఠ పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నేత తేజస్వీ యాదవ్ మాత్రం ఈ అంచనాలను కొట్టిపారేశారు. తమ కూటమి మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), బీజేపీతో సహా ఎన్డీయే (ఔఆం) కూటమిలోని ఐదు పార్టీలు బరిలో నిలిచాయి. జేడీ(యూ), బీజేపీలు 101 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇక ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎమ్ఎల్) లిబరేషన్, ఇతర లెఫ్ట్ పార్టీలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీలు మహాగఠ్‌బంధన్‌గా (మహాకూటమి) ఏర్పడి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పక్రియకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 8.00 గంటలకు ఈ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు జరుపుతారు. అనంతరం అంటే.. 8.30 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతుంది. అందుకోసం 243 రిటర్నింగ్ అధికారులు, 243 పరిశీలకుల ఈ ఓట్ల లెక్కింపును పర్యవేక్షించనున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో- ఆబ్జర్వర్లతో సిబ్బందిని ఏర్పాటు చేశారు. అందుకోసం ఎన్నికల సంఘం 4,372 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసింది. అభ్యర్థులు నియమించిన 18 వేల మందికిపైగా ఏజెంట్స్ సైతం ఈ లెక్కింపు పక్రియను పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ నిర్వహించారు. నవంబర్ 6వ తేదీన 121 స్థానాలకు, నవంబర్ 11వ తేదీన 122 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ రెండు విడతల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. దీంతో 67.13 శాతం పోలింగ్ నమోదయింది. 1951 తర్వాత.. ఆ రాష్ట్రంలో ఇంత భారీగా పోలింగ్ నమోదకావడం ఇదే తొలిసారి. ఇక ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందంటూ ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనే దానిపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత రానుంది. మరో వైపు ఈ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా ఇదేరోజు ప్రకటించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అందులో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం సైతం ఉంది. ఈ అసెంబ్లీ స్థానానికి మంగళవారం అంటే.. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికను నిర్వహించారు.

# ఉల్లి రైతుకు తీరని నష్టం

(మొదటి పేజి (తరువాయి)

ఉల్లి పంట నిల్వలు ఉండగా..ఇప్పుడు కొత్త పంట కూడా మార్కెట్‌లోకి రావడం, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు ఎగుమతులు నిలిపివేయడం వంటి కారణాల మూలాన ధరలు అమాంతం పడిపోయాయి. మంగళవారం కిలో రూ.2కు పడిపోయిన ధరలు బుధవారం రూ.1 కంటే దిగువకు పడిపోయాయి. కనీసం రవాణా ఛార్జీలు కూడా దక్కకపోవడంతో రైతు మార్కెట్‌లోనే కంటతడి పెడుతున్నారు. ఉల్లి ప్రధాన మార్కెట్లలో ఒక్కటైన మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో మంగళవారం కిలో ఉల్లి ధర రూ.2గా ఉంది. బుధవారం మరో ప్రధానమార్కెట్ అయిన మంద్‌సౌర్‌లో కిలో ఉల్లి ధర రూ.1కి, అంతకంటే దిగువకు పడిపోయింది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. మాల్వాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రాజస్థాన్‌లోని అల్వార్‌లోనూ ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ కూడా కిలో ఉల్లి రూ.1 నుంచి రూ.5 మధ్యనే పలుకుతోంది. నాణ్యత మరీ అధికంగా ఉంటే కిలో రూ.8 చొప్పున కొంటున్నారు. ఇక ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి పాయల మార్కెట్‌గా పేరొందిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలోనూ ఉల్లి రైతు గోడు అంతాఇంత కాదు.

కొత్త, పాత ఉల్లిపాయల నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే ఉల్లి పాయల ధరలు పడిపోయినట్లు ప్రకటించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వ డబుల్ ఇంజిన్ సర్కార్లు చేతులు దులిపేసుకుంటున్నాయి. అన్నదాతలకు కనీస మద్దతు కూడా ఇవ్వకుండా పరిహాసమాడు తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి..ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసినా..డబుల్ ఇంజిన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తోంది. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెల్లుల్లి ధరలు కూడా భారీ స్థాయిలో పడిపోవడంతో అక్కడి రైతన్నలు ఆక్రందనకు గురౌతున్నారు. వాతావరణ పరిస్థితులు, నిల్వ చేయడానికి అవసరమైన గోడౌన్లు లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి ఉల్లి పంట సాగు చేసే రైతన్నలను సంక్షోభంలోకి నెట్టేశాయని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ డిఘోలే అన్నారు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రత్లాం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర కేవలం రూ.600గా ఉంది. పొలం నుంచి మార్కెట్‌కు ఉల్లిని తరలించడానికి రవాణాకు అయిన ఖర్చు కూడా రావడం లేదని నగ్రా గ్రామానికి చెందిన ఓ అన్నదాత వాపోయాడు. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2 వేలు అయ్యింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాల్‌కు రూ.250లే వచ్చాయి. తీవ్రంగా నష్టపోయాం' అని దుంఖం నిండిన కళ్లతో ఆ రైతు అన్నారు.

# రబీ సాగుకు నీరు

(మొదటి పేజి (తరువాయి)

స్పందించిన నేతలు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, డీఈలకు ఆదేశాలు జారీ చేయడంతో నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ప్రాజెక్టు ఏఈ కృష్ణకుమార్, ప్రాజెక్టు చైర్మన్ గోడి జయప్రకాష్ నాయుడు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి బాసినేని రమేష్ బాబు, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ తదితరులు కాలువ మార్గాన్ని పరిశీలించి అనంతరం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.సుమారు 60 క్యూసెక్కుల నీటిని వదలనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.చెరువులు నిండుతాయ్ బోర్లు మళ్లీ బలపడతాయి ఈ నీటి విడుదలతో అంకన్నకుంట, కొడవండ్లపల్లి చెరువుతో పాటు పరిసర ప్రాంతాల చిన్న చెరువులు, వంకలు, వాగులు, చెక్‌డ్యాములు నిండుతాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో బోర్లలో నీటి మట్టం పెరిగి, రబి పంటల సాగు సాఫీగా సాగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.రైతులు హర్షం... "మా ప్రాంతంలో చెరువులు నిండితేనే జీవనం ఉంటుంది. ఇప్పుడు ప్రాజెక్టు నీరు వదిలినందుకు మాకు పునరుజ్జీవం లభించింది" అని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



స్థానిక ప్రజాప్రతినిధులు వైవిఆర్ నీటిని విడుదల చేయడంలో సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్ చైర్మన్ శివయ్య, నల్లాని వెంకటనారాయణ చౌదరి, వలిమి చెర్లపల్లి నారాయణస్వామి, ముత్తులూరి మధుసూదన, మల్లెల నారాయణస్వామి, రమణారెడ్డి, కొలసాని చంద్ర, అశోక్, చింతలనాయుడు, జేబీ, శీను నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకోట వెనుక నిప్పులాంటి నిజం

## 32 కార్లతో వరుస పేలుళ్ల కోసంరెడీ అయిన ముష్కరులు

## డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలన్న భారీ స్కెచ్

## దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్ర కోణాలు



**న్యూ ఢిల్లీ, నవంబర్ 13 :**

దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మాడిఫై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్( ఈజీసతిటజీశిజీట)లోని అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు లొకేషన్లలో దాడులకు వినియోగించాలని మొత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కోసం అవసరం అయ్యే పేలుడు పదార్థాల కొనుగోలుకు వైట్‌కాలర్ డాక్టర్లు నిధులు సమకూర్చారని పేర్కొన్నారు. నిందితులు సుమారు రూ. 26 లక్షల నిధిని సేకరించినట్లు సమాచారం. ఈ నిధులను పోగు చేసిన అనుమానితుల్లో డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఉన్నారని అధికారులు గుర్తించారు. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రధానంగా డాక్టర్ ఉమర్ నబీ ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉన్నత విద్యావంతులు, వైట్‌కాలర్ ఉద్యోగులు ఉగ్ర కుట్రలో భాగం కావడాన్ని కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ):ఢిల్లీ పేలుళ్ల ఘటనకు కారణమైన కీలక నిందితుల్లో ఒకరైన డాక్టర్ షాహీన్ పట్ల ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడిన తీరు విస్మయం వ్యక్తం చేస్తోంది. షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని.. కనీసం అలాంటి సంఘటనకు సంబంధించిన ఆనవాళ్లు కూడా తెలియవని ఆమె కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రస్తుతం తాము లక్నోలోని దాలిగంజ్ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో నివాసముంటున్నామని, తాముండే ప్రాంతానికి ఢిల్లీకి సుమారు 550 కిలోమీటర్ల దూరం ఉంటుందని షాహీన్ తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ అన్నారు.ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో షాహీన్‌కు సంబంధముందని, జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తోందనే ఆరోపణలపై ఆమె అరెస్ట్ కావడం కలిచివేస్తోందని వాపోయారు.

# విజయవంతంగా క్రెడిట్ చోరీ

(మొదటి పేజి (తరువాయి)

లక్షల ఇళ్ల పట్టాలను అక్క చెల్లెమ్మలకు ఇచ్చి, వారి పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించాం. 21.75 లక్షల ఇళ్లను శాంక్షన్ చేయించి?కోవిడ్‌లాంటి మహమ్మారి ద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ 9 లక్షలకుపైగా ఇళ్లను మా హయాంలోనే పూర్తిచేసినా, అన్నీ మీరే చేశారన్నట్టుగా మీరు చెప్పడమే కాకుండా, మీ ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేయించుకుని, ఆ క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్న మీ స్కీం చాలా హేయం అంటూ విమర్శలు గుప్పించారు.

# ఫ్రీ ప్రయాణ నిధులు

(మొదటి పేజి (తరువాయి)

చేసింది చంద్రబాబు సర్కార్. రెండున్నర నెలల్లో మహిళలకు టికెట్లు జారీ చేసిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్త్రీశక్తి పథకం కోసం ఆర్టీసీకి నిధులు విడుదల చేయడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ, అలాగే ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్తిలో పోలీస్ నిఘా

(మొదటి పేజి (తరువాయి)

ముమ్మరం చేశారు. ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సిఎంలు పర్యటించే ప్రదేశాలు, విమానాశ్రయం, హెలీప్యాడ్, రోడ్డు మార్గాలను, ప్రశాంతి నిలయంలో బాబా వారి జన్మదిన వేడుకల నిర్వహణ చోటు, సాయి కుల్వంత్ హాలు, హిల్ వ్యూ స్టేడియం ప్రాంతాల్లో ప్రతి రోజూ ఎస్పీ పర్యటిస్తూ ఆ ప్రాంతాల్లో బందోబస్తుకు ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.ఎటువంటి అనుమానం వచ్చిన వెంటనే విస్తృ త తనిఖీలు చేబట్టే విధంగా పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రౌతు సరిగా వుంటేనే గుర్రాలు సరిగ్గా పరిగెడతాయ్ అన్న చందంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అప్రమత్తంగా వుంటూ పోలీస్ సిబ్బందినీ అప్రమత్తం చేస్తూ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# లోకేష్ భూమి పూజ

(మొదటి పేజి (తరువాయి)

సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైరెడ్డి వెల్లడించారు. అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్‌మె, ఏఐ రీసెర్చ్, కస్టమర్ డెలివరీ ఎక్సలెన్స్‌పై ఫినోమ్ దృష్టి సారించనుంది. 3 దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టి, 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఓ సేవల డెలివరీ కార్యకలాపాలను ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టనుంది.

# ఆక్రమణలు రుజువు చేయాలి



**చిత్తూరు, నవంబర్ 13 :**

అటవీభూముల ఆరోపణలపై ఎంపి మిథున్ రెడ్డి స్పందించారు. విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ మిథున్ రెడ్డి కౌంటర్ అటాక్ ఇచ్చారు. తాజాగా ఆయన పలు విషయాలలో పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. పవన్ కళ్యాణ్ ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మిథున్ రెడ్డి ఈ పోస్టులో పవన్ కళ్యాణ్‌ను నేరుగా సవాల్ విసిరారు. ఆయన చేసిన పోస్ట్ లో.. పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ.. మీరు ఆరోపణలు చేసి తర్వాత వెనక్కి తగ్గడంలో నిపుణులు. ఇదే పని మీరు ఎర్రచందనం విషయంలో కూడా చేశారు. ఇప్పుడు మీరు హెలికాప్టర్ నుంచి చూపించిన భూమి మా చట్టబద్ధమైన సొత్తు. మేము ఆ భూమిని 2000 సంవత్సరంలో చట్టబద్ధంగా కొనుగోలు చేశాం అని మిథున్ రెడ్డి తెలిపారు. అలాగే, మీరు చేసిన ఆరోపణలు నిరూపించండి. ఆధారాలు ఉంటే బయటపెట్టండి. లేకపోతే ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని ఆయన హెచ్చరించారు.

# ఏనుగుల సంచారంపై ముందస్తు హెచ్చరికలు

## అటవీశాఖ అధికారులకు డిప్యూటీసిఎం పవన్‌కళ్యాణ్ సూచన

**అమరావతి, నవంబర్ 13 :**

ఏనుగుల సంచారంపై ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. ఈ పక్రియను మరింత పెంచాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం డిప్యూటీ సీఎం చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఈ ఘటన చోటు చేసుకుందని, అక్కడ కూడా సదరు ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని పవన్‌కు అటవీ శాఖ అధికారులు వివరించారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వస్తోందని ట్రాక్ చేసిన వెంటనే సమీప గ్రామాల వారికి ముందుగానే తెలియచేశామని చెప్పారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ముందస్తు హెచ్చరికలను మరింత విస్తృతం చేయాలన్నారు. గ్రామాలవారీగా నూ, రైతులతోనూ సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటు చేసి వాటికి టెక్స్ట్ మెసేజ్‌లతో పాటు, వాయిస్ మెసేజ్‌లు కూడా పంపిస్తే సమాచారం తొందరగా చేరుతుందని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు.

# నోబెల్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారి యశస్వి భారతికి సన్మానం

**తాడిపత్రి, నవంబర్ 13:**
తలపై 100 ట్యూబ్లైట్లను పగలగొట్టించుకున్న టైక్వాండో చిన్నారి యశస్వీ భారతిని గురువారం భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తల మీద ఆరు నిమిషాల తొమ్మిది సెకండ్లలో 100 ట్యూబులైట్లను పగలగొట్టించుకొని నోబెల్ వరల్డ్ రికార్డు సాధించి, తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న చిరంజీవి యశస్వీ భారతిని, టైక్వాండో కోచ్ సాయి బాబాని, స్పోర్ట్స్ టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు శివయ్య సమక్షంలో ఘనంగా సన్మానించామని తెలిపారు. ఇలాంటి సహసోపిత నిర్ణయాలు తీసుకొని మరింత ముందుకు వెళ్తూ, మన తాడిపత్రి పట్టణానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తూ, మరెన్నో అవార్డులు పొందాలని చిన్నారి యశస్వీ భారతిని ఆశీర్వదించామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నా రంగనాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శి జూటూరు ఓబిరెడ్డి, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి పాల్గొన్నారు



చిన్నారి యశస్వీ భారతిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు



పి సిద్ధరాంపురం గ్రామంలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఈవో జి.శివశంకర్

# పారిశుద్ధ్యం పనులు పరిశీలన

## జిల్లా పరిషత్ సీఈఓ జి.శివశంకర్

**ఆత్మకూరు, నవంబర్ 13:**
ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను జిల్లా పరిషత్ సీఈఓ జి శివశంకర్ పరిశీలించారు. గ్రామంలో ఇళ్ల నుండి గ్రీన్ అంబాసిడర్ లు చెత్తను ఏ విధంగా సేకరిస్తున్నారు సరిగా తీసుకొని పోతున్నారా లేదా. సేకరించిన చెత్తను ఏ విధంగా ఉపయోగిస్తున్నారు మొదలగు వాటిని పరిశీలించారు. గ్రామంలోని కాలనీల్లో గ్రామ ప్రజలతో మాట్లాడి వారితో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా గురించి ప్రజలతో చర్చించారు వివరాలు సేకరించారు. సేకరించిన చెత్తను సరిగా తీసుకుని పోతున్నారా సరైన పద్ధతిలో దానిని విడదీస్తున్నారా వర్మీ కంపోస్టుకు దీన్ని ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే వివరాలను స్వయంగా పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్లకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని శుభ్రమైన తాగునీరు అందించుటకు తప్పక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ లక్ష్మీనరసింహ, పంచాయతి కార్యదర్శి మల్లేష్ స్థానిక నాయకులు శశాంక్ చౌదరి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



పి సిద్ధరాంపురం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సీఈవో జి.శివశంకర్



జగన్మోహన్ రెడ్డిని కలిసిన కనేకల్ మండల వైఎస్సార్సీపి కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమన

# కష్టపడి పని చేసే వారికి తగిన ప్రాధాన్యత

## అధినేత జగన్మోహన్ రెడ్డి .. మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి

**కనేకల్ నవంబర్ 13:**
పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని కనేకల్ వైయస్సార్సీపి పార్టీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమన మర్యాద పూర్వకంగా గురువారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితి నాయకుల పనితీరు గురించి జగన్మోహన్ రెడ్డి ఆరా తీశారు నియోజకవర్గం లో సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి నేతృత్వంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ, కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుండి విశేష స్పందన లభించిందని చెప్పడంతో జగన్ సంతోషం వ్యక్తపరిచారు. వై ఎస్ ఆర్ సి పి నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ చురుకుగా పనిచేయాలని జగన్ సూచించారు. కష్టపడే వారిని గుర్తించి పార్టీలో రాబోవు రోజుల్లో సముచిత స్థానం అందిస్తామని అధినాయకుడు తెలిపారు. కూటమి సర్కార్ చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులపై ప్రజల్లో కి తీసుకువెళ్లి ప్రజలను చైతన్య పరచాలన్నారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ కుట్ర పై ప్రజలను చైతన్యం చేయాలన్నారు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను చంద్రబాబు మోసం చేస్తున్నారని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందించి పోరాటం చేయాలన్నారు వైఎస్ఆర్సిపి పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి అధికారంలోకి రాగానే గుర్తింపు ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.



భక్తుల చేత హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు. పూజల్లో పాల్గొన్న భక్తులు

## కన్నుల పండువగా శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం

# ధ్వజస్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవం

### శ్రీ విఘ్నేశ్వర స్వామికి పంచామృత రుద్రాభిషేకం.. నవగ్రహ, మహా సుదర్శన హోమం..

**బెళుగుప్ప, నవంబర్ 13:**
మండల కేంద్రమైన బెళుగుప్ప శ్రీ వినాయక నగర్ లో కొలువైన శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ట వార్షికోత్సవ పూజలు కన్నుల పండుగగా నిర్వహించారు. గత ఏడాది నవంబర్ 13వ తేదీన ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేశారు. అందులో భాగంగానే నేటికీ ఏడాది పూర్తి కావడంతో, ధ్వజస్తంభ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం ప్రతిష్ట వార్షికోత్సవ పూజల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు రాంబాబుస్వామి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆలయంలో సంకల్పం మహాగణపతి పూజ, స్వస్తిపుణ్యహవాచనం, ఆలయ సంప్రోక్షణ, నవగ్రహారాధన, కలశ స్థాపన, అనంతరం శ్రీ విఘ్నేశ్వర స్వామి మూలవిరాట్ కు ఏకవార పంచామృత రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం, బలి, పూర్ణాహుతి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు..



ప్రత్యేక పూజల్లో భాగంగా కలశ స్థాపన చేసిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో శ్రీ విఘ్నేశ్వర స్వామి మూలవిరాట్

# భార్యను నరికి చంపిన భర్త

### కొడవలితో లొంగుబాటు.. అనాధలైన చిన్నారులు..

**బెళుగుప్ప, నవంబర్ 13:**
అనుమానం పెనుభూతమై, కట్టుకున్న వాడే కాలయముడై భార్య శాంతి (34) ని కొడవలితో నరికి చంపిన భర్త ఆంజనేయులు ఉదంతం మండల కేంద్రమైన బెళుగుప్ప లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెళుగుప్ప కు చెందిన నారాయణప్ప కుమార్తె శాంతి కి గుంతకల్లుకు చెందిన లారీ డ్రైవర్ ఆంజనేయులుతో వివాహమైంది. శాంతి ఆంజనేయులు దంపతులకు మహేంద్ర అనే కొడుకు, లహరి అనే కూతురు ఉన్నారు. శాంతి ఆంజనేయుల దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగింది. అదే కాలనీకి కు చెందిన ఒక వ్యక్తితో శాంతి అక్రమ సంబంధం ఉన్నదన్న అనుమానం ఆంజనేయులు లో కలిగింది. దీంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. అయితే గురువారం లారీ డ్రైవింగ్ కు వెళ్లిన ఆంజనేయులుతో ఓ యువకుడు ఫోన్ చేసి నీ భార్య ప్రవర్తన ఏమీ బాగోలేదని, అదుపులో పెట్టుకోవాలని, లేనిపోని అనుమానాలు కలిగించాడు. దీంతో ఆంజనేయులు తీవ్ర ఆవేశానికి లోనై లారీని అక్కడే వదిలేసి బెళుగుప్ప కు తిరిగి వచ్చి భార్య శాంతితో గొడవ పడ్డాడు. క్షణికావేశానికి లోనై ఆంజనేయులు కొడవలితో భార్య శాంతి ని అత్యంత దారుణంగా నరికి చంపాడు. చుట్టుపక్కల వారు గమనించి చూసేసరికి ఆంజనేయులు అదే కొడవలితో బయటకు వచ్చి పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయాడు. ఉరవకొండ సిఐ మహానంది, యస్ఐ శివ, ట్రైనీ ఎస్ఐ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. శాంతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు శాంతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..



శాంతి మృతదేహం. (శాంతి (ఫైల్ ఫోటో)



అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

# గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

### ఆరు గొర్రెలు మృతి..

**బెళుగుప్ప, నవంబర్ 13:**
బెళుగుప్ప మండలం పరిధిలోని కళ్యాణదుర్గం- రాయదుర్గం ప్రధాన జాతీయ రహదారి లో నరసాపురం గేట్ సమీపంలో ఆర్టీసీ బస్సు గొర్రెల మందపై దూసుకెళ్లగా ఆరు గొర్రెలు మృతి చెందాయి. సమాచార వివరాల మేరకు కళ్యాణదుర్గం నుంచి బళ్లారి కి వెళ్లే ఆర్టీసీ బస్సు నరసాపురం గేట్ సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మల్కాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి..

## సరైన చికిత్స లేకపోతే

# గణనీయమైన వైకల్యానికి దారితీస్తుంది

### ఎద్దులపల్లి పిహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ..

**పామిడి, నవంబర్ 13:**
చర్మపు పుండ్లు, నరాల క్షీణత, కండరాల బలహీనత కుష్టు వ్యాధి యొక్క సాధారణ లక్షణాలు అని సరైన చికిత్స చేయకపోతే తీవ్రమైన, గణనీయమైన వైకల్యానికి దారి తీస్తుందని ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుండి గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ నందు మానవహారాన్ని చేపట్టారు. కుష్టు వ్యాధి అనేది దీర్ఘకాలికమైన, నయం చేయగల అంటు వ్యాధి అన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నటువంటి వారిని గుర్తించటానికి ఈనెల 17 వ తేది నుండి 30 వ తేది వరకు ఇంటింటా సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు రాలిపోవటం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతులతో వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవటం వంటి లక్షణాలున్న వారిని ఎద్దులపల్లి పిహెచ్సీకి రెఫర్ చేయాలని ఆదేశించారు. కుష్టు వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఉదయార్క్, డిపిఎంఓ రామచంద్ర, సూపర్వైజర్లు శ్రీరాంరెడ్డి, సూర్యకళ, సుధాకర్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి గురించి అవగహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్



కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం



ఆర్ అండ్ బి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న బేనేకల్ యువత

# రహదారి మధ్యలో గొయ్యి

### ప్రమాదం అంచున ప్రయాణికులు..

**కనేకల్, నవంబర్ 13:**
మండలం పరిధిలోని బెనికల్ గ్రామం నుండి సీతారామ నగర్ క్యాంపు కు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి కి మధ్యలో గొయ్యి ఏర్పడింది. ఈ రహదారి ద్వారా బళ్లారికి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదానికి గురి అయ్యే వీలుంది. గొయ్యిని గుర్తించిన బేనేకల్ యువకులు వాహనదారులు ప్రమాదం బారిన పడకుండా గొయ్యి చుట్టుపక్కల ముళ్ళ కంపలు రాళ్లను ఉంచి ప్రమాదం జరగకుండా జాగ్రత్త వహించారు. ఈ ప్రధాన రహదారి గుండా చాలామంది ప్రయాణికులు ప్రయాణిస్తారు కాబట్టి ప్రమాదానికి లోనయ్యే అవకాశం ఉంది కాబట్టి ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి ఈ గొయ్యికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి పూర్తి చేసి ప్రమాదం బారిన పడకుండా చూడాలని యువత కోరారు.

# రైతులు పంట నమోదు వివరాలు పరిశీలించుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా..

**యాడికి, నవంబర్ 13 :**
మండల వ్యాప్తంగా రైతులు తాము సాగు చేసుకున్న పంటలను ఆయా రైతు సేవ కేంద్రాలలో ఖరీఫ్ 2025 సీజన్ కు సంబంధించి అన్ని సర్వే నెంబర్లను డిజిటల్ పంట నమోదు లోనికి తీసుకున్నట్లు గురువారం మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలు , బీడుగా ఉన్న భూములు తమ సిబ్బంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు . .ఈ వివరాలు తెలిపే జాబితా అన్ని రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కొరకు నోటీసు బోర్డులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు . రైతులు తమ సర్వే నెంబర్లను , పంట వివరాలను సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలనీ పలు సూచనలు సలహాలు అందించారు . రైతుల వివరాలు తప్పుగా నమోదు అయి ఉంటే,మూడు రోజుల్లో తమ సిబ్బందికి తెలియజేస్తే , ఆ రైతు వివరాలు సరిచేసి తిరిగి నమోదు చేస్తామన్నారు. ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్ బాషా కోరారు.



# శ్రీ గంధం, కుంకుమ అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

**తాడిపత్రి నవంబర్ 13:**
చారిత్రాత్మక దేవాలయమైన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీకమాసం ఉత్సవాలలో భాగంగా 23వ రోజున గురువారం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి శ్రీ గంధం, కుంకుమలతో ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు గావించిన అనంతరం శ్రీ గంధం, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



శ్రీ గంధం, కుంకుమలతో ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

# ముదిగుబ్బలో రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు

**ముదిగుబ్బ, నవంబర్ 13:**
ముదిగుబ్బ పట్టణంలో రూ.19 లక్షల గ్రామపంచాయతీ నిధులతో అభివృద్ధి పనులకు భూమిపూజ జరిగింది. గురువారం పాతఊరు కనకదుర్గమ్మ కట్ట వద్ద సిసి రోడ్డుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, సర్పంచ్ లక్ష్మీదేవి చిన్నరాయుడు లు భూమి పూజ చేశారు. గేటు కొట్టాల విశ్వ భారతి స్కూల్ వద్ద ఇదేవిధంగా సిసి రోడ్లు వేసున్నట్లు చెప్పారు. చెలిమి బావి వీధి ప్రాంతంలోనూ, వడ్డెర్ల కాలనీ దారిలోనూ 2 కల్వతులను రూ.4 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోనుగుంట్ల రామాంజనేయులు, నల్లాని వెంకటనారాయణ చౌదరి, వేలూరు గోపాల్ నాయుడు, తుమ్మల శ్రీనివాసులు, కొండేటి శ్రీనివాసులు, జి.గోపాల్, బండి గోపాల్, తుమ్మల కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న కూటమి నాయకులు

# ఏఎన్ఎం సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోండి

### ఆలూడి గ్రామం ప్రజల ఫిర్యాదు.

**అగళి, నవంబర్ 13 :**
మండల పరిధిలోని రావుడి పంచాయతీ ఆలూడి గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం హనుమక్క సక్రమంగా విధులకు హాజరు కాకుండా వుండడమే కాక ఎక్కడో వుండి ఫోన్ చేసి ఓటిపి లు అడగడం, వారు చెప్పకపోతే వారిపై దురుసుగా ప్రవర్తించడం, అలాగే గర్భవతులు బాలింతలను కూడా దురుసుగా మాట్లాడటం చేస్తున్నారని ఆమె విధులకు ఎప్పుడు వస్తారు ఎప్పుడు పోతారో కూడా తెలియదని గ్రామ ప్రజలు ఆరోపిస్తూ ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకొని సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని లేదా విశ్వసనీయతతో విధులు నిర్వహించే వేరే ఏఎన్ఎం ను కేటాయించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ భాను ప్రకాష్ ఫిర్యాదు చేశారు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న జనసేన పార్టీ మండల కన్వీనర్ భాను ప్రకాష్

# నేడు శ్రీ మహాలక్ష్మి, శ్రీ భూతప్ప స్వామికి కార్తీకమాస కుంభాభిషేకం

**అమరాపురం, నవంబర్ 13:**
మండల పరిధిలో బసవన్నపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ మాత మహాలక్ష్మి, శ్రీ భూతప్ప స్వామి దేవాలయాలలో కార్తీకమాసం కుంబాభిషేకం, దీపోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పరమేశ్వరప్ప, ఉపాధ్యక్షులు డైరీ రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి దేవరాజు, దేవస్థానం యజమానులు రంగధామప్ప , చామరాజు ఎం. చిక్క రంగప్ప వి. రంగస్వామిలు తెలిపారు. గురువారం ఆలయ శుద్ధి కర్ణ మరియు అన్నసంతర్పణం వైభవంగా జరిగింది. ఈనెల 14న శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మ వారికి కార్తీక మాసం కుంబాభిషేకం మహా మంగళహారతి తీర్థప్రసాదాలు సాయంకాలం 6:00 కు దీపోత్సవం ఈనెల 15న భూతప్ప స్వామి దేవాలయము నందు విశేష పూజలు మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం కుంబాభిషేకం, సాయంత్రం దీపోత్సవం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.




మాట్లాడుతున్న ఎం పి అంబికా లక్ష్మి నారాయణ, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాస్, ఎం ఎస్ రాజు

# వాల్మీకులకు పెద్దపీట వేసింది తెదేపానే

### ఎంపి అంబికా .. ఎమ్మెల్యేలు కాలువ, ఎం ఎస్ రాజు . మాజీ ఎమ్మెల్సీ గుండుమల ..

గుడిబండ, నవంబర్ 13:
వాల్మీకులకు పెద్ద పీఠం వేసి సామజిక న్యాయం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీ నని అనంతపురం ఎం పి అంబికా లక్ష్మి నారాయణ, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాస్, మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడిబండలో గురువారం వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా విచ్చేసిన వారికి నాయకులు,కార్యకర్తలు స్థానిక బస్టాండ్ లో గజ మాలతో సత్కరించి పురవీదుల గుండా ఊరేగింపుగా రావడంతో మహిళలు, నాయకులు వారిపై పూల వర్షం కురుపించారు. అనంతరం సభ వద్దకు వారు చేరుకొని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని


నాయకులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మాట్లాడుతూ మహాకవి వాల్మీకి మహర్షి పవిత్రమైన రామాయణం గ్రంథాన్ని రచించి మానవాళికి పరిచయం చేస్తే భారతీయుకు మహా గ్రంథంలా ఆదారించారన్నారు. అలాంటి మహాకవిని గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం అన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ సైతం బోయాలకు విద్య వైద్య రంగంలోనే కాకా ఆర్థికంగా సామజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుటకు సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా వాల్మీకులను ఎస్ టీ జాబితాల్లో చేర్పించుటకు కూటమి ప్రభుత్వానికి విన్నమించుకొంతమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కుంచిటిగా ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ, మండలం తెదేపా కన్వీనర్ లక్ష్మి నరసప్ప, సింగల్ విండో అధ్యక్షుడు మద్దన్నకుంటప్ప, రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా సాధికార కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు ఎన్ మంజునాథ్, జిల్లా వీరాశైవ లింగయత్ సాధికార అధ్యక్షుడు దుర్గేష్ తెదేపా మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, వాల్మీకి సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోటి సంతకాలతో చంద్రబాబుకు కనువిప్పు

### పెత్తందాన్ల కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం.. వైకాపా సమన్వయకర్త ఈరలకప్ప. .

**అమరాపురం, నవంబర్ 13:**
రాష్ట్రంలో పేద ప్రజలకు విద్యార్థులకు దూరం చేస్తున్న వైద్య విద్యను వైయస్సార్ సిపి ఇంటింటికి వెళ్లి కోటి సంతకాలను చేయించి ప్రైవేటీకరణను ఆపేలా చంద్రబాబు ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలని మడకశిర నియోజకవర్గం వైయస్సార్ సిపి సమన్వయకర్త చీరల కప్ప గురువారం మండల పరిధిలో బసవనపల్లి ఆరోనపల్లి తాండ గ్రామాలలో వైయస్సార్ సిపి పంచాయతీ కన్వీనర్ శివకుమార్ మండల కన్వీనర్ త్రిలోక్నాథ్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఈరలకప్ప మాట్లాడుతూ ప్రస్తుతం చంద్రబాబు


ఆరోనపల్లిలో సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం


ఇంటింటా సంతకాల సేకరణ చేస్తున్న ఈర లక్కప్ప, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న , పంచాయతీ కన్వీనర్ శివకుమార్ తదితరులు

నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాస్తున్నారని పేద ప్రజలను పూర్తిగా విస్మరించారన్నారు. పేద విద్యార్థులకు వైద్య కళాశాల లో ప్రభుత్వమే నిర్వహించేలా చూడాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంజూరు కాగా అందులో 5 కళాశాలలో పూర్తి అయ్యాయి. మిగతా 12 కళాశాలలు వివిధ దశలలో ఉండగా ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని పి. పి. పి. విధానములో నడపడానికి చూస్తున్నారుని విమర్శించారు. దీంతో తాము ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయాలను సేకరించి కోటి సంతకాలతో గవర్నర్కు పంపాలని తెలిపారు. అప్పటికైనా చంద్రబాబు మేలుకొంటారన్నారు స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ నరసింహ మూర్తి, ఎంపీటీసీ నరసింహమూర్తి,మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు నారాయణప్ప కృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలకప్ప, బసవనపల్లి పంచాయతీ వైఎస్ఆర్సిపి కన్వీనర్ శివకుమార్, మండల కన్వీనర్ త్రిలోక్నాథ్

# చినుకులు వస్తే చిత్తడే చిత్తడి

### కాలిబాటకు కూడా నోచుకోక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు..

**అగళి, నవంబర్ 13 :**
అగళి మండలం అనుమనపల్లి గ్రామం నుంచి ఆర్ జి పల్లి రోడ్డు చిన్నపాటి చినుకులు పడితే చిత్తడే చిత్తడి అవుతుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్జిపల్లి బడికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాల్సి ఉంది వర్షం వస్తే కాలిబాటన నడవాలన్న నోచుకోక రోడ్డు బురుదమయంగా తయారై విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు చదువు కోవడానికి అనుమనపల్లి గ్రామం నుంచి ఆర్జీపల్లి ఉన్నత పాఠశాలకు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని అనేకమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు ప్రజలు వాపోతున్నారు. చివరికి విద్యార్థులందరూ ఏకమై స్థానిక ఎంపీటీసీ చంద్రప్ప ను అనుమనపల్లి నుండి ఆర్ జి పల్లి వరకు తారు రోడ్డు వేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ తిప్పే స్వామి దృష్టికి కూడా తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు ఎంపీటీసీ చంద్రప్ప తెలిపారు. ఏది ఏమైనా విద్యార్థుల సౌకర్యార్థం కోసం రోడ్డును బాగు చేయించాలని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ ప్రజలు కోరుతున్నారు.


గుంతల్లో నీటితో బురదమయమైన రోడ్డు


స్థానిక ఎంపీటీసీ చంద్రప్పతో మాట్లాడుతున్న విద్యార్థులు

# అసెస్మెంట్ పరీక్షలు-1 పరీక్ష కేంద్రాల పరిశీలన

### ఎంఇఓ -2 చంద్రశేఖర్ నాయుడు...

**అగళి, నవంబర్ 13 :**
విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు-1 సోమవారం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే గురువారం మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎంఇఓ -2 చంద్రశేఖర్ నాయుడు పరిశీలించారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తగినన్ని డెస్క్ లను, గదులను కేటాయించాలని ఏరోజుకారోజు జరుగుతున్న పరీక్షలకు పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులను కేటాయించాలన్నారు. ప్రతిరోజు ఇన్విజిలేషన్కు హాజరైన ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను ఒక రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాయడానికి తగిన విధంగా వెంటిలేషన్ ఉండేటట్లు తరగతి గదులను సన్నద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఎవరూ కూడా మట్టిలో కానీ చెట్ల కింద కానీ పాఠశాల బయట గాని కూర్చొని పరీక్షలు రాయకూడదని తరగతి గదిలోనే కేటాయించిన డెస్క్ లోనే కూర్చొని పరీక్షలు రాసేవిధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని అన్నారు. ఒకవేళ తగినన్ని డెస్కులు అందుబాటులో లేకపోతే అప్పుడు మాత్రమే వరండాలో కూర్చోబెట్టి పరీక్షలను రాయించాలన్నారు. అదేవిధంగా సమయపాలన పాటిస్తూ ఏ రోజుకు ఆరోజు జరుగుతున్న పరీక్షలను వాటి ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా తీసుకువచ్చి పరీక్షలను నిర్వహించాలి పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలకు తావు ఇవ్వకుండా నిర్వహించాలని తెలియజేశారు.


జడ్పీ హెచ్ఎస్ లో పరిశీలిస్తున్న ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు


ఏపీ ఆదర్శ పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈఓ 2 చంద్రశేఖర్ నాయుడు

# వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

**ముదిగుబ్బ, నవంబర్ 13:**
తలుపుల మండలంలోని భూపతివారిపల్లి, చంద్రనాయక్ తండ గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ గురువారం దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. శాశ్వత వ్యాధిగ్రస్తులు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న దృశ్యాన్ని రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ చలించి నిరుపేదలకు, అనారోగ్యం బాడిన పడ్డవారికి దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లోని నిరుపేదలకు, వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా పలువురు అనారోగ్యం బారిన పడిన నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యులు ప్రకాష్, వేణు, అంగన్వాడి టీచర్, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మన్సూర్


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మన్సూర్

### ప్రభుత్వాలు, పాలకులు మారినా

# గ్రామీణ రహదారుల సమస్య తీరడం లేదు

### డొక్కలపల్లి,జి జి పల్లి, గాయత్రి కాలనీ గ్రామ ప్రజల ఆరోపణ

**అగళి, నవంబర్ 13 :**
ప్రభుత్వాలు పాలకులు మారుతున్నారే కానీ గ్రామీణ రహదారుల సమస్యలను తీర్చడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని హెద్ది హళ్లి పంచాయితీ గాయత్రి కాలనీ నుండి ఇరిగేపల్లి మండే మారమ్మ దేవాలయం వరకు అలాగే గాయత్రి కాలనీ నుండి పి బ్యాడి గెరా వరకు,గ్యారగొండన పల్లి నుండి అగళి వరకు, ఆర్ జి పల్లి పంచాయతీ హనుమనపల్లి నుండి ఆర్ జి పల్లి, బొమ్మసానిపల్లి వరకు, ఇనగలూరు పంచాయతీ ఇనగలూరు నుండి నరసాంబుది గ్రామం వరకు,తదితర పల్లెటూర్ల రహదారులు దాదాపు పది పన్నెండేళ్ళుగా ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు నాయకులు వచ్చి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీలు గుప్పించి ఆ తర్వాత చేతులు దులుపు కుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే చొరవ తీసుకొని మండలంలోని గ్రామీణ రోడ్లను పరిశీలించి మండల కేంద్రానికి అనేక పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్న ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు


అధ్వాన్నంగా మారిన గాయత్రి కాలనీ రోడ్డు


అధ్వాన్నంగా మారిన గ్యారగొండన పల్లి రోడ్డు



ప్రమాణ స్వీకారం చేసిన పెద్దకడబూరు టీడీపీ మండల కమిటీ సభ్యులు. టీడీపీ మండల ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన నల్లమల విజయ్ కుమార్. మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డిని సన్మానించిన చిన్నతుంబళం టీడీపీ గ్రామ అధ్యక్షులు నరసింహులు


# అట్టహాసంగా పెద్దకడబూరు మండల టీడీపీ కమిటీ ప్రమాణ స్వీకారం

## మండల అధ్యక్షులుగా గవిగట్టు మల్లికార్జున.. మండల ప్రధాన కార్యదర్శిగా మొట్రు రామాంజనేయులు..

**పెద్దకడబూరు, నవంబర్ 13 :**
పెద్దకడబూరు మండల టీడీపీ కమిటీ, మండలంలోని ఆయా గ్రామాల టీడీపీ కమిటీలు గురువారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. పెద్దకడబూరు మండల టీడీపీ అధ్యక్షులుగా గవిగట్టు మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శిగా మొట్రు రామాంజనేయులు, మండల ఉపాధ్యక్షులుగా నల్లమల విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కంబదహాల్ మునెప్ప, జాలవాడి ముక్కన్న, చిన్నకడబూరు గోనుమాను నరసన్న ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మండల కార్యదర్శులుగా శాంతయ్య, కల్లుకుంట సర్దార్ బాషా, చిన్నతుంబళం పూజారి ఈరన్న, కోశాధికారిగా తిక్కయ్య ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ యూనిట్ ఇన్ చార్జ్ గా పెద్దకడబూరు తలారి అంజీ ప్రమాణ స్వీకారం చేశారు. చిన్నతుంబళం టీడీపీ గ్రామ అధ్యక్షులుగా నరసింహులు, జాలవాడి గ్రామ అధ్యక్షులుగా బోయ యంకన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ యువనేత రాకేష్ రెడ్డిలకు టీడీపీ మండల కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన పెద్దకడబూరు టీడీపీ మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ టీడీపీ మండల కమిటీలో తమపై నమ్మకంతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి యువతకు పెద్దపీట వేశారని, ఇందుకు తాము రుణపడి ఉంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళుతామని ధీమా వ్యక్తం చేశారు. పెద్దకడబూరు మండలంలో టీడీపీకి పూర్వ వైభవం తెస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సానుభూతి పరుల విజయానికి సైనికుల్లా పని చేసి మండలంలో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సైనికుల్లా పని చేసి రాబోయే రోజుల్లో పెద్దకడబూరు మండలాన్ని టీడీపీ కంచుకోటగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మిణి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబురావు, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, హనుమంతరెడ్డి, చిన్నతుంబళం గ్రామ సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప, టీడీపీ నాయకులు సొంటెన్న, హనుమేశప్ప, డీలర్ నాగప్ప, రాఘవరెడ్డి, కోడిగుడ్ల దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తలారి అంజి



టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డిని సన్మానించిన టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప, మండల కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులను సన్మానించిన దృశ్యం



కళాకారులను సన్మానించిన దృశ్యం

# కళాకారులకు సత్కారం

**ఆదోని, నవంబర్ 13 :**
ఆదోని శ్రీ అనంత మంగళ స్వామి దేవాలయం కాంప్లెక్స్‌లోని లలిత కళా సేవా సంస్థ కార్యాలయంలో గీతా జయంతి ని పురస్కరించుకొని ప్రముఖ హార్మోనిస్టు చిన్న హెూటూరు రామచంద్రమూర్తి, రంగస్థలం కళాకారులు తుమ్మలపెడు గోవిందును ఘనంగా సన్మానించారు. సంగీత నాటక కళారంగానికి వారు చేస్తున్న సేవలను గుర్తించి లలిత కళా సేవా సంస్థ అధ్యక్షులు నల్లారెడ్డి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ కళ కోసం కాదు సమాజంలోని ప్రజల కోసం అన్నారు. రామచంద్రమూరి, గోవిందు లాంటి కళాకారులు ఎందరో పౌరాణిక పాత్రల ద్వారా ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. ఇలాంటి కళాకారులను ప్రోత్సహించడం ఎంత అవసరమన్నారు. సమాజంలో మానవత విలువలు పెంపొందించే ప్రయత్నం చేస్తున్నందున వారికి సంస్థ అధ్యక్షులు నల్లారెడ్డి, సీనియర్ కళాకారులు వల్లి సాబు, భూసానిపల్లి సోమలింగప్ప సత్కరించారు.

# భవనాల అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోండి

## మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా

**గుత్తి, నవంబర్ 13:**
భవన నిర్మాణ క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా బిల్డింగ్ పీనలైజేషన్ - 2025 కు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఈ అవకాశాన్ని అనధికారికంగా భవనాలు నిర్మించుకున్న వారు, అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మీయా అన్నారు. ఈ పథకం ద్వారా పురపాలక సంఘం నుండి ఎటువంటి అనుమతులు పొందని భవనాలు, భవన నిర్మాణ అనుమతికి విరుద్ధంగా నిర్మించిన భవనములను క్రమబద్ధీకరించుకోవచ్చున్నారు. ఈ పథకంద్వారా 1985 జనవరి 1 నుంచి నుండి 2025 ఆగస్టు 31 మధ్య కాలంలో నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవచ్చున్నారు. చివరి తేదీ 2026 మార్చి 11 అన్నారు. ఈ సదవకాశాన్ని పుర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీనికి సంబంధించి ఏమైనా సందేహాలు, వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



# పండ్ల తోటలను తొలగించడం తగదు

## సిపిఐ మండల కార్యదర్శి చింత పురుషోత్తం ..

**పెద్దపప్పూరు, నవంబర్ 13**
పెద్దపప్పూరు సిపిఐ మండల కార్యదర్శి చింత పురుషోత్తం వీటిని తీవ్రంగా ఖండిస్తున్నారు . తాడిపత్రి నుండి పామిడి వరకు పెన్నానది పరివాహక ప్రాంతంలో ఉన్న పండ్ల తోటలను తొలగించాలని నిర్ణయించడం విచారకరమని సిపిఐ మండల కార్యదర్శి చింత పురుషోత్తం అన్నారు. గత 50 సంవత్సరాలుగా పెన్నా నది పరివాహక ప్రాంతంలో కొన్ని వేల కుటుంబాలు పండ్ల తోటలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరి వల్ల పెన్నా నదికి ఎటువంటి ప్రమాదం లేదన్నారు. అంతే కాకుండా వీరు పెన్నానది నుండి అక్రమంగా ఇసుక తరలించకుండా అడ్డుకుంటున్నారన్నారు. తాడిపత్రి ప్రాంతంలో బండ్ల ఫ్యాక్టరీలు నిలిచి పోవడంతో ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.



# నిబంధనలను సడలించి పత్తి కొనుగోలు చేయాలి

**ఆదోని, నవంబర్ 13:**
ఎక్కువ సంఖ్యలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి సీసీఐ నిబంధన లను పూర్తిగా సడలించి రైతుల దగ్గర ఉన్న పత్తినంత తక్షణమే కొనుగోలు చేయాలి. సక్రమంగా తూకాలు వేయాలి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వేయాలిడిమాండ్. ఈ దినం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదోనిలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించడమైనది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే వెంకటేశులు మాట్లాడారు. గత పది రోజుల నుండి సీసీ ఐ కేంద్రం లో మూడు ఫ్యాక్టరీలో కలిపి కేవలం 12000 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయడం చాలా అన్యాయమన్నారు. లీజుకు తీసుకున్న ఫ్యాక్టరీ కెపాసిటీని బట్టి స్లాట్ కుకింగ్ కు అవకాశం ఉండడంవల్ల చాలామంది రైతులకు స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం లేదు. మూడు ఫ్యాక్టరీల్లో కలిపి కేవలం 5000 కింటాలుకు మాత్రమే స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఇవ్వడం వల్ల చాలామంది రైతులు స్లాట్ బుక్ చేసుకోవడం సాధ్యం కావడం లేదు. దీనికంతటికి బాధ్యత ప్రభుత్వానిదే. అరకురగా కొంత పత్తిని కొంతమంది రైతులతో కొనుగోలు చేసి చేతులు దులుపుకోవాలని ఉంది. చాలామంది రైతులు స్లాట్ బుకింగ్ కోసం గ్రామాల్లోపడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి రోజుకు లక్ష క్వింటాల్వరకు కొనుగోలు చేయాలి. అదేవిధంగా సిసిఐ నిబంధన లుపూర్తిగా సడలించి రైతుల దగ్గరున్న పత్తిమంత కొనుగోలు చేయాలి. క్వింటాలకు 8110 రూపాయలు ప్రకారం కొనుగోలు చేయాలి. తూకంలో మోసాలు అరికట్టాలని ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. ఈ దినం ముగ్గురు రైతులు ఒక్కొక్క రైతు రెండు క్వింటాలు చొప్పున తూకంలో మోసానికి గురవున్నారు. రైతుల తిరుగుబడితే వాటిని సరి చేయడం జరిగింది. కావున భవిష్యత్తులో మోసాలు జరగకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఆదోని మండల అధ్యక్షులు కార్యదర్శిలు బాష అయ్యప్ప రైతు సంఘం నాయకులు శేఖర్ రైతులు పాల్గొన్నారు




మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

# హెచ్ మురవణి టీడీపీ గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం

## గ్రామ అధ్యక్షులుగా సొంటెన్న..

**పెద్దకడబూరు, నవంబర్ 13 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్ మురవణి టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు గురువారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. టీడీపీ గ్రామ అధ్యక్షులుగా సొంటెన్న ( చిన్న ఉరుకుందు), గ్రామ ఉపాధ్యక్షులుగా నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా రంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సత్యన్న, బోయ సురేష్, బోయ వీరేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే గ్రామ కార్యదర్శులుగా బోయ ఉసేని, మజ్జిగ దస్తగిరి, శ్రీనివాసులు, గ్రామ కోశాధికారిగా ఊబగడ్డల రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్నను గజమాలతో సన్మానించి గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ గ్రామ అధ్యక్షులు సొంటెన్న మాట్లాడుతూ హెచ్. మురవణి గ్రామంలో టీడీపీకి పూర్వ వైభవం తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ గ్రామ అధ్యక్షులు సొంటెన్న




టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న హెచ్ మురవణి టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు

# గ్రీవెన్స్ సమస్యలను త్వరగా పరిష్కరించండి

## కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు...

**బెళుగుప్ప, నవంబర్ 13:**
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, తహసిల్దార్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్లు మధుసూదన రావు, గురుబ్రహ్మం, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కార అర్జీలపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రస్తుతం 22 అర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. అందులో రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలం గృహ నిర్మాణం తదితర సమస్యలకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. వాటన్నింటినీ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



గ్రీవెన్స్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిస్తున్న కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు

# ఘనంగా శ్రీ గౌరీదేవి గ్రామోత్సవం

## అమ్మవారికి ప్రత్యేక పూజలు.. హారతులు ఇచ్చిన చిన్నారులు.. ఆకట్టుకున్న మహిళల నృత్యాలు.. అమ్మవారి ఉత్సవ విగ్రహం మంగోటి చెరువులో నిమజ్జనం..

బెళుగుప్ప, నవంబర్ 13:
బెళుగుప్ప శ్రీ రామేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో కొలువు తీర్చిన శ్రీగౌరీదేవి అమ్మవారి గ్రామోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈనెల 5వ తేదీ కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయం వంశ పార్యంపర పూజారులు తిప్పేస్వామి కుటుంబ సభ్యులు శ్రీ గౌరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక మండపంలో కొలువు తీర్చి, తొమ్మిది రోజులపాటు మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, చక్కెర హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలంకరణ తో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ లో ఉంచి గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థంలో చిన్నారులు ముచ్చటగా అలంకరించుకుని దీపాల హారతులతో, తేజ కోలాట బృందం సభ్యులు ప్రత్యేక డ్రెస్ కోడ్ తో కోలాటం, నృత్యాలు చేస్తూ గ్రామ సమీపంలోని మంగోటి చెరువులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మహిళలు చిన్నారులు వేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది.మహిళలు గౌరీ దేవి పాటలతో దీపోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలతో అమ్మవారిని నిమజ్జనం చేశారు..



శ్రీ గౌరీదేవి గ్రామోత్సవం



బెళుగుప్పలో శ్రీ గౌరీదేవి నిమజ్జనంలో చెరువులో దీపాలు వదులుతున్న



హారతులు పట్టిన చిన్నారులు. ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల నృత్య ప్రదర్శన. ఆకట్టుకున్న మహిళల కోలాటం



ఆనంద నిలయం సందర్శించిన రత్నం ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల చైర్మన్ తలారి రత్నం, 9 వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు

## ఆనంద నిలయం సందర్శన

**బద్వేల్, నవంబర్ 13:**
వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం నందిపల్లె గ్రామంలో జీసస్, మేరీ, జోసఫ్, సంస్థ ఆధ్వర్యంలో మానసిక అంగవైకల్యం కలిగిన బాల బాలికల సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన ఆనంద నిలయాన్ని రత్నం ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల చైర్మన్ తలారి రత్నం, 9 వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు సందర్శించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక అంగవైకల్యం వికలాంగులకు సేవలందించడం అభినందనీ యమని, ఇక్కడ మానసిక అంగవైకల్య కలిగిన పిల్లలకు ఆరోగ్య పరంగా అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ తెరపి, మ్యూజిక్ తెరపి, లాంటి సేవలందిస్తున్నారని ఈ నిలయంలో పనిచేస్తున్న జేఎంజే సిస్టర్ లను వారు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో జే, యం, జే, సంస్థ ఇక్కడ సేవలందించడం ఎంతో గర్వకారణం అని ఈరోజు ఈ సంస్థలో ఉండే బాల బాలికలకు 9 వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు సహకారంతో పుస్తకాలు, పలక,బలపాలు, బ్యాగులు వంటివి పంచి పెడుతున్నామని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ పరిసర ప్రాంతంలోని వయసుతో సంబంధం లేకుండా మానసిక వికలాంగులు ఎవరైనా ఉంటే ఇక్కడ చేర్పించవచ్చు అని వారికి ఆనంద నిలయం తరఫున సిస్టర్లు సేవలందిస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమంలో పనిచేస్తున్న సిస్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాములు నాయుడుకి నివాళి

### ఎమ్మెల్యే పరిటాల సునీత..

**కదిరి, నవంబర్ 13:**
కదిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు, స్థానిక శాసనసభ్యుడు కందికుంట వెంకట ప్రసాద్ సన్నిహితులు, పరిటాల కుటుంబ శ్రేయోభిలాషి గాలివేటి కృష్ణమోహన్ నాయుడు తండ్రి గాలివేటి శ్రీరాములు నాయుడు చిత్ర పటానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఘనంగా నివాళులర్పించారు. గత వారంలో శ్రీరాములు నాయుడు మరణించగా గురువారం ఎమ్మెల్యే సునీత చిన్న యల్లంపల్లి గ్రామానికి వెళ్లారు. గాలివేటి శ్రీరాములు నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కృష్ణమోహన్ నాయుడుతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీరాములు నాయుడు కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలు అందించారని పరిటాల రవికి వారు ఎంతో ఆప్తులుగా ఉండేవారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. వారి కుటుంబానికి స్థానిక శాసనసభ్యుడు కందికుంట వెంకట ప్రసాద్ గారితో పాటు తాము కూడా అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు.





వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ , సివిల్ పోలీసులు

## ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం

**గుత్తి, నవంబర్ 13:**
గుత్తిలో గురువారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గుత్తి ఎక్సైజ్ స్టేషన్, గుత్తి స్టేషన్, గుంతకల్లు వన్ టౌన్ , గుంతకల్లు టూ టౌన్ పోలీస్ స్టేషన్, కసాపురం పోలీస్ స్టేషన్‌లలోని ఎక్సైజ్ నేరములలో పట్టుబడ్డ ఐడి, డిపిఎల్, ఎన్డిపిఎల్ మద్యం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎక్సైజ్ సీఐ ఉమాదేవి , ఎస్సై పల్లా గోపాల్ గుంతకల్లు వన్ టౌన్ సిఐ, గుంతకల్లు టూ టౌన్ సిఐ, కసాపురం ఎస్ఐ , గుత్తి సిఐ రామారావు, పామిడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిబ్బంది పాల్గొనడం జరిగినది. గుత్తి ఎక్సైజ్ స్టేషన్‌లో మొత్తం 48 కేసులలో 294.36 నాటు సారా, 46 కేసులలో 100 లీటర్ల డిపిఎల్ మద్యం, ఒక ఎన్‌డిపిఎల్ కేసులోని 7.02 లీటర్ల కర్ణాటక మద్యం, గుత్తి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ ఎక్సైజ్ కేసులలో మొత్తం డిపిఎల్ కేసులలో 10 లీటర్లు, ఎన్‌డిపిఎల్ కేసులలో 135 లీటర్ల కర్ణాటక మద్యం, ఐడి కేసులలో 11 లీటర్ల మద్యం, గుంతకల్లు వన్ టౌన్ , గుంతకల్లు టూ టౌన్ కసాపురం , పామిడి పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుపడ్డ ఎక్సైజ్ కేసులలోని మద్యం ధ్వంసం చేసినట్టు గుత్తి ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు.

### కాలుష్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్యం

### ఎంపీడీవో రాధాకృష్ణ వేణి..

**ముద్దనూరు, నవంబర్ 13 :**
కాలుష్యం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్యం అని ఎంపీడీవో రాధాకృష్ణ వేణి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర శిక్షణ కార్యక్రమం జరిగింది. మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో సర్పంచులకు ఉప సర్పంచ్లకు, పంచాయతీ కార్యదర్శులకు,ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినది. ఈ సందర్భంగా కాళహస్తి నుండి వచ్చిన స్పెషల్ అబ్జర్వర్ సరళ మాట్లాడుతూ శుభ్రత అంటే సురక్షితమైన త్రాగునీరు, పారిశుధ్య సేవలు అందిస్తూ తక్కువ కాలుష్యం గల గ్రామాలుగా తీర్చిదిద్దుతూ,మన పిల్లల భవిష్యత్ కొరకు ప్రకృతి మనకు ప్రసాదించిన సూర్యకాంతి,గాలి,నీరు,మట్టి, ఖనిజాలు, మొక్కలు వన్యప్రాణులు గల పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. అలాగే గాలి, నీరు, భూమి కాలుష్యం అవడం వలన అనేక వ్యాధులు, వైరస్ లు వ్యాపిస్తాయి కాబట్టి శుభ్రమైన పర్యావరణంను సంరక్షించాలి సంరక్షించుకోవాలని అన్నారు.పర్యావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ ను నియంత్రించడానికి అన్ని చర్యలను కచ్చితంగా పాటిస్తూ. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ ను వాడకుండా తగు చర్యలు తీసుకోవాలి అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఇంటి నుండి చెత్తను(తడి మరియు పొడి) సేకరించి ఎస్ డబ్ల్యూ పిసి సెంటర్ తరలించి వర్మీ తయారు చేయించాలి అన్నారు. పరిశుభ్రత వాయు కాలుష్యం సంబంధిత ఆరోగ్య సమస్యలను తగ్గించుటకు వాహన కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలి కొరకు ప్రజా రవాణా వాహనాలను ఉపయోగించుట తగ్గించుకుంటూ,విరి విరిగా మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్తు వినియోగం వంటి పద్ధతులపై దృష్టి పెట్టాలన్నారు.అనంతరం స్థానిక ఎస్ డబ్ల్యూ పిసి నందు వర్మీ తయారీ విధానమును పరిశీలించి పంచాయతీ సెక్రెటరీ నరసింహ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, వీరభద్రుడు, ఏపీవో గంగయ్య, డిపిఆర్సి, డి.సి రమణారెడ్డి, డిపి ఆర్ సి సురేష్ వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు ఉప సర్పంచ్లు పంచాయతీ కార్యదర్శులు, ఎం ఆర్ సి కరి మున్నీసా, పాల్గొన్నారు,



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ సరళ



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు అధికారులు

## కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా..

### బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త ఇంచార్జ్ రితీష్ రెడ్డి..

**బద్వేల్, నవంబర్ 13:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. బద్వేల్ నియోజకవర్గం టీడీపీ కార్యకర్తలకు గురువారం చరిత్రాత్మక రోజుగా నిలిచింది. పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అట్లూరు మండలం, పార్టీ అధ్యక్షుడిగా మల్లికార్జున రెడ్డి, బద్వేల్ మండలం రూరల్ పార్టీ అధ్యక్షులుగా రవికుమార్ రెడ్డి, గోపవరం మండలం, పార్టీ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి, బి కోడూరు మండలం పార్టీ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, పోరుమామిళ్ల మండలం పార్టీ అధ్యక్షుడిగా భైరవ ప్రసాద్, కలసపాడు మండలం పార్టీ అధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి, కాశి నాయనామండలం పార్టీ అధ్యక్షుడిగా రాజారెడ్డి , బద్వేల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వెంగల్ రెడ్డి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావం ణంలో, ఘనంగా బద్వేల్ టిడిపి క్యాంపు కార్యాలయంలో జరిగింది. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి టిడిపి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ఇంచార్జ్ యువ నాయకుడు రితిష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. బద్వేల్ రూరల్ మండల టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త , ఇంచార్జ్ రితీష్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రమాణ స్వీకార మహోత్సవం ప్రారంభం నుంచి చివరి వరకు పార్టీ నినాదాలతో కార్యాలయం ప్రాంగణం పసుపు పతాకాలతో కళకళలాడింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు వేదికపై ప్రమాణ స్వీకారం చేసి, పార్టీ పట్ల తమ విశ్వాసం, కట్టుబాటు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ఇంచార్జ్ యువ నాయకుడు రితీష్ రెడ్డి మాట్లాడుతూ "టిడిపి కార్యకర్తలే పార్టీకి వెన్నెముక. మీరు గెలుస్తేనే పార్టీ గెలుస్తుంది. ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ నేను అండగా ఉంటా. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మన యువ నేత నారా లోకేష్ ఇచ్చిన బాధ్యతలను అందరం కలిసి నెరవేర్చుదాం" అన్నారు. పార్టీ శ్రేణుల్లో క్రమశిక్షణ, ప్రజల సమస్యలపై చురుకైన స్పందన, గ్రామస్థాయిలో బలమైన సంఘటనా నిర్మాణం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. టీడీపీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు ప్రజల మన్ననలు పొందిన పార్టీగా నిలవడానికి కారణం కార్యకర్తల కష్టమేనని అలాగే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లోకార్యకర్తలు సత్తా చాటే సమయం వచ్చిందని గుర్తుచేశారు. అనంతరం మాజీ తెలుగుదేశం పార్టీ అట్లూరు మండలం అధ్యక్షులు బోవిల్ల. అమర్నాథ్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్ రెడ్డి తో పాటు7 మండలాల పార్టీ అధ్యక్షులను నలుగురు డైరెక్టర్లను పూలమాలలతో దృశ్యాలు వాళ్ళతో ఘనంగా సత్కరించి పార్టీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం లోని 7 మండలాల నుండి టిడిపి సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, కో-క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, కో-యూనిట్ ఇంచార్జీలు, టిడిపి కుటుంబ సభ్యులు భారీగా పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న టిడిపి నేతలు

## యాడికి పోలీస్ స్టేషన్ రికార్డులు తనిఖీ

### జిల్లా ఎస్పీ పి.జగదీష్ ..

**యాడికి. నవంబర్ 13 :**
యాడికి వ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ జగదీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాడికి పోలీస్ స్టేషన్‌లో 2025 సంవత్సరానికి సంబంధించిన వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ ప్రాంగణం, లాక్‌అప్స్, రికార్డులు, ప్రాపర్టీ స్టోరేజ్ రూమ్, కేస్ డైరీ ఫైళ్లను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో మరింత క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజా సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో శుభ్రత, రికార్డుల నిర్వహణ, సాంకేతిక వనరుల వినియోగం, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.కేసుల పెండెన్సీ తగ్గించాలి. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పెంచాలి. దొంగతనం కేసుల్లో రికవరీ సాధించాలి. రోడ్డు ప్రమాదాల నియంత్రణ మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయాలని సుచించారు. అనంతరం విలేఖలతో సమస్యలు అడిగి తెలుసుకున్నగా విలేకరులకు పోలీస్ స్టేషన్కు రావద్దంటూ అధికారులు తెలిపారని విలేకరులకే ఇలా అన్నప్పుడు ప్రజలకు ఏమాత్రం గౌరవిస్తారని ఎస్పీ జగదీష్ కి విలేకరులు తెలిపారు. క్రైమ్ వార్తలు 10 గంటలకు పంపిస్తే మేము వార్తలు ఎలా రాయాలని ఎస్పీకి తెలిపారు వీటిపై ఎస్పీ జగదీష్ పోలీస్ అధికారికి అడగగా సమాధానం ఇవ్వలేకపోయారు. ఇలాంటి ఘటలలో మరొకసారి రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విలేకరులతో కలిసి ఉంటేనే సమస్యలు అడిగి తెలుసుకోవచ్చని వీరు పూర్తి సమాచారాన్ని ఇచ్చే వారు కూడా వార్త రూపంలో ఇస్తారని మీరు సక్రమంగా సమాచారం వారు వచ్చిన రీతిలో లాస్య మీరే ఇబ్బంది పడతారన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి. యాడికి సీఐ ఈరన్న. ఎస్సై వెంకటరమణయ్య పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .



యాడికి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ జగదీష్



యాడికి పోలీస్ స్టేషన్ సిబ్బందితో జిల్లా ఎస్పీ జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బారెడ్డి

## మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ఎంపీడీవో జె. సుబ్బారెడ్డి

**దువ్వూరు, నవంబర్ 13 :**
మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జె. సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభ భవనంలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచ్ లకు, పంచాయతీ కార్యదర్శులకు క్లిన్ అండ్ గ్రీన్ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎంపీడీవో సుబ్బారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చెత్తను సేకరించి పొడి చెత్త తడి చేత్త విడి విడిగా చేసి చెత్త సంపద కేంద్రాలలో నిల్వ చేసి తరువాత సీసాలను వేరుగాచేయాలని, చెత్తను ఎరువు తయారు చేయాలన్నారు. మండలంలో అన్ని శాఖలలో ఏమైనా సమస్యలుంటే ఈ శిక్షణ తరగతులలో చర్చించుకుని గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు మెరుగు పరిచేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అలాగే పచ్చదనము పరిశుభ్రతపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మొక్కలను పరిరక్షించాలని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛమైన గాలి ప్రతి ఒక్కరికి అందేలా పచ్చదనం పరిశుభ్రత పై ప్రత్యేక - అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ,మండలంలోని ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచ్ ను, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటించిన వైద్య అధికారి వినయ్ కుమార్

## నిమోనియా పట్ల జాగ్రత్త వహించండి

### వైద్య అధికారి వినయ్ కుమార్..

**బద్వేల్, నవంబర్ 13:**
నిమోనియా పట్ల జాగ్రత్త వహించాలని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలో గురువారం సి బోయినపల్లి, ఈ బోయినపల్లిలో లార్వా, ఫీవర్, ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజలకు వ్యాధులపై శుభ్రతపై అవగాహన కల్పించారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, వర్షాలు పడి, వాతావరణం మారిందన్నారు. మంచు పడుతున్నందున జలుబు, దగ్గు ఉందన్నారు. కాచి వడగట్టిన నీటిని తాగాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటిలో లార్వా ఉన్న నీటిని తొలగించి తొట్లను శుభ్రపరచుకోవాలన్నారు. దోమలను నివారించాలంటే, రాత్రి వేళలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. మండలంలో తడి ప్రదేశాలలో అబౌట్ బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. నిల్వ ఉన్న మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. సిబ్బంది చేత మండలంలో సర్వే చేస్తూ అవసరం ఉన్న చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు పోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు .ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శిరీష, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సూపర్వైజర్ వెంకటమ్మ, ఎఎన్ఎంలు లక్ష్మీనారాయణమ్మ, నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ కిట్ల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

## రబీ సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

**ఎల్ఎన్ పేట, నవంబర్ 13 :**
రబీ సీజన్లో సాగు చేపట్టే పంటల పై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గురువారం లక్ష్మీ నర్సు పేట రైతు సేవా కేంద్రం లో రబీ డ్రై షోయింగ్ (ఆర్డీఎస్) కిట్లు తయారు పై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బి.నరసింహ మాట్లాడుతూ రబీ సీజన్ లో ప్రధానం గా అపరాలు సాగు చేపట్టతారు.అదనపు ఆదాయం కోసం అదనపు పంటలు సాగు చేపట్టాలని తెలిపారు.వీటికి ఆర్డీఎస్ కిట్లు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు.వివిధ విత్తనాలు తో తయారుచేసిన కిట్లు పంటలు ఆదాయం తో పాటు భూమి లో ఉండే సూక్ష్మజీవులకు ఈ పంటలు రక్షణ గా ఉంటుందని తెలిపారు.అనంతరం చొర్లింగి గ్రామం లో. బీజామృతం తయారు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెంటర్ పద్మావతి, ఐసిఆర్పీలు జ్యోతి, పూర్ణ రావు సంతోషి, పూజ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ప్రమాద బీమా చెక్కు అందిస్తున్న దృశ్యం

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కుటుంబానికి భరోసా

### ప్రమాద బీమా నగదు పంపిణీ

**ఉదయగిరి(దుత్తలూరు), నవంబర్ 13**

దుత్తలూరు మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త సభ్యత్వ నమోదు కలిగి ఉండడంతో ఇటీవల ప్రమాదవశాస్తూ మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా నగదును తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు. తెదేపా సభ్యత్వం కలిగిన వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, జాతీయ ప్రధాన కార్యదర్శి ,రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ నేతృత్వంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహకారంతో దుత్తలూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఉండేలా గురువారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తెడ్డుపాడు గ్రామానికి చెందిన మేలింగి సురేష్ మృతి చెందగా నామిని అయినటువంటి ఆయన భార్య మేలింగి ప్రియాంక కు రూ.5లక్షలు ను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు చెన్నకేశవులు సర్పంచ్ వెంకటరత్నం మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి కార్యకర్తకు భరోసా అందించే ప్రమాద బీమా సౌకర్యం లేదని మొట్టమొదటిగా తెలుగుదేశం పార్టీ లోనే ఈ సౌకర్యం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సారధ్యంలో కార్యకర్తల కుటుంబానికి అండగా నిలవాలని ప్రమాద బీమా సౌకర్యం తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందని అన్నారు. ఈ సౌకర్యం వలన అనేకమంది కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని కొనియాడారు. ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్నటువంటి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాల మనలు పొందుతూ చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తూర్పు రొంపి దొడ్ల సచివాలయం

## మొరాయించిన విద్యుత్ మోటార్

### సచివాలయంలో నీళ్లకు ఇక్కట్లు .. ఇబ్బందులు పడుతున్న సచివాలయ సిబ్బంది ప్రజలు .. రోజులు గడుస్తున్న పట్టించుకోని పాలకులు ..

**ఉదయగిరి (వరికుంటపాడు), నవంబర్ 13 :**


మండలంలోని తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో గత కొన్ని నెలలుగా మోటర్ మరమ్మతులకు గురవడంతో స్థానిక సచివాలయంలో వాష్ రూమ్ లో నీటి సౌకర్యం లేక స్థానికంగా పనిచేస్తున్నటువంటి అధికారులు వివిధ పనుల కోసం సచివాలయానికి వెళ్లినటువంటి ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వాష్ రూమ్ కి వెళ్ళవలసిన అవసరం వచ్చినప్పుడు నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. స్థానిక పాలకులు కనీస మౌలిక సదుపాయాలు ముఖ్యమైనది నీటి సౌకర్యం అయినప్పటికీ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్న రోజులు గడుస్తున్న సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో అటు అధికారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి స్థానిక సచివాలయంలో యుద్ధ ప్రాతిపదికన నీటి సౌకర్యం ఏర్పాటు కొరకు అవసరమైనటువంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

## అపస్మా స్పోర్ట్స్ మీట్ బ్రోచర్ ఆవిష్కరణ

### ఎమ్మెల్యే కాకర్ల సురేష్..

**ఉదయగిరి(వింజమూరు) నవంబర్ 13 :**

వింజమూరు మండల కేంద్రంలోని ఎమ్మెస్సార్ గ్రౌండ్‌లో మనోహర్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నియోజకవర్గ స్థాయి అపస్మా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రత్యేక అతిథిగా ఆహ్వానించి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ అపస్మా అధ్యక్షులు కె.వి.రత్నం నియోజకవర్గ కరస్పాండెంట్స్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

## జర్నలిస్టులకు వైద్య సేవలు అందించడంలో ఐఎంఏ గుంటూరు శాఖ ఆదర్శంగా నిలవాలి

**గుంటూరు నవంబర్ 13:**

స్వాతంత్రానికి ముందు 1928లో స్థాపితమైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ ఏపీ శాఖకు అనుబంధంగా 150 కి పైగా ఆసుపత్రులు, 1600 మందికి పైగా వైద్యులతో నిరంతరాయంగా ప్రజలకు వైద్య, ఆరోగ్య చైతన్యం అందించడంలో గుంటూరు శాఖ ముందుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు కొనియాడారు. నిరంతరం ప్రజల సమస్యలు, హక్కుల కోసం నిలిచే జర్నలిస్టులకు వైద్య సేవలు అందించడంలో కూడా ఆదర్శంగా నిలవాలని నిమ్మరాజు కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు.. అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలి.. రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు..

**నెల్లూరు, నవంబర్ 13 :**

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అధికారులను హెచ్చరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం నెల్లూరుకు విచ్చేసిన ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు నగరంలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్, ఇందిరాగాంధీనగర్ లోని రేషన్ షాపు, దర్గామిట్టలోని ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ను తనిఖీ చేసి 1/2 కేజీ చక్కెర ప్యాకెట్లలో గ్రామాల్లో చక్కెర తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. హమాలీలతో జీతాల విషయమై మాట్లాడారు.చక్కెర తక్కువగా ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.ఇందిరా గాంధీ నగర్ లోని రేషన్ షాప్ ను తనిఖీ చేసి ఈ పోస్ మిషన్ లో సాంకేతిక లోపాలను గుర్తించారు.కార్డుదారులందరికి ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం,చక్కెర అందించాలని సూచించారు.దర్గామిట్టలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ను తనిఖీ చేశారు. గడువు ముగిసిన సాల్ట్ ప్యాకెట్లను గుర్తించి హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, శుభ్రంగా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఫుడ్ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు.కోడిగుడ్ల బరువు కూడా తక్కువగా ఉందని ఆయన గుర్తించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.



వసతి గృహాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు



రేషన్ షాపు పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు

ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో అశ్రద్ధగా ఉన్నా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రుచిగా, శుచిగా పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. హాస్టల్స్ కు సరఫరా అయ్యే వస్తువులను ముందుగా సరిచూసుకోవాలని, నిర్దిష్ట ప్రమాణాల మేరకు తూకం, వస్తువు గడువు తేదీ పరిశీలించుకోవాలని సూచించారు. రేషన్ షాపుల్లో గుర్తించిన సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పౌర సరఫరాల విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. తొలుత ఆర్ అండ్ బి అతిథి గృహంలో అధికారులతో ఫుడ్ కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు.ఫుడ్ కమిషన్ సభ్యులు వెంట డీఎస్ఓ లీలారాణి, డిఎం అర్జున్ రావు, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్,బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఫుడ్ సేఫ్టీ అధికారి నీరజ,ఐ సి డి ఎస్ పిడి హేనాసుజన్,సమన్వయ అధికారి సైమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువ ఆక్రమణ, ఇంటి నిర్మాణం

### పట్టించుకోని రెవెన్యూ అధికారులు.. లబోదిబోమంటున్న ఆయకట్టు రైతాంగం..

**సంగం, నవంబర్ 13:**

సంగం చెక్‌పోస్టు సమీపంలోని ఎన్ హెచ్ రోడ్డును ఆనుకొని ప్రభుత్వ స్థలంలో వంటకాలువను ఆక్రమించి నివాసం కట్టుకుంటున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. సంగం పంచాయతీ పరిధిలో ఎర్ర చెరువు ఉంది. ఈ చెరువు నీరు ఎక్కువ అయిన సమయంలో కలుజువాగును చెరువుకి తూర్పు భాగాన ఏర్పాటు చేశారు. ఈ కాలువ ద్వారా వందలాది ఎకరాలకు నీరు మళ్లించుకుని పంట పండిచ్చేకునేందుకు అవకాశం ఉందని రైతాంగం అంటున్నారు. ఈ భూమికి సంబంధించి గతంలో డి ఫారం ఇచ్చారని, అయితే ఈ నిబంధన ప్రకారం భూమిని అమ్మకూడదు, కొనుగోలు చేయకూడదన్న నిబంధన ఉంది. రెవెన్యూ అధికారులను కూడా లెక్కచేయకుండా ప్రభుత్వ భూమిలో నివాసం కట్టుకుంటున్నారని సమాచారం. సర్వే నంబర్ 439. 439 / 1, 438/18. సర్వే నంబర్లకు సంబంధించి ప్రభుత్వ భూమి గతంలో టీ ఫామ్ పట్టా మంజూరు చేసినట్లు తెలుస్తుంది. రైతాంగం అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తే వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు ఎవరూ స్పందించడం లేదని అంటున్నారు.

జాతీయ రహదారికి సంబంధించి గతంలో రోడ్డు వెడల్పు చేసే సమయంలో 100 అడుగుల స్థలాన్ని ప్రభుత్వానికి కేటాయించాల్సి ఉండగా ఆ సమయంలో పనులు జరగకపోయేసరికి నిలిచిపోయాయి. ప్రస్తుతం సంగంలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని కాలువను పూడ్చి ఇంటి నిర్మాణం చేపట్టడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. రహదారిపై కూత వేటు దూరంలో రెవెన్యూ కార్యాలయం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా రెవెన్యూ అధికారులు. ఇరిగేషన్ శాఖ అధికారులు. రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ప్రజలు, ఆయకట్టు రైతాంగం కోరుతున్నారు.



రోడ్డు పక్కన కాలువ పూడ్చి నిర్మాణం చేపడుతున్న నివాసం

## నెహ్రూపై విమర్శలు తగవు

### డాఎం ఎన్. తులసీ రెడ్డి..

**గుంటూరు , నవంబర్ 13:**

భారత్ సమగ్రాభివృద్ధికి పునాదులు వేసిన నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పై విమర్శలు చేయడం తగదని సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవించే ఆర్.ఎస్.ఎస్ లాంటి సంస్థలు సోషల్ మీడియాలో నెహ్రూ వ్యక్తిగత హననానికి పాల్పడటం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాఎం ఎన్. తులసీ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో దేశ ప్రగతిలో నెహ్రూజీ పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధాన వక్తగా పాల్గొని డాఎం ఎన్. తులసీ రెడ్డి ప్రసంగించారు. నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేసి, పంచవర్ష ప్రణాళికలను అమలు చేసి, అతి పేదరికంలో ఉన్న భారత్ ను ముందుకు నడిపిన మహనీయుడని కొనియాడారు. అమెరికా, రష్యా కూటముల వైపు మొగ్గకుండా అలీన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందినారన్నారు. దేశ విభజన అనంతరం 565 సంస్థానాలను విలీనం చేసి ఫ్రెంచ్ నుండి పుదుచ్చేరిని, పోర్చుగీసు నుండి గోవాను విముక్తి చేసి భారత దేశ సమగ్రతను కాపాడినారని తెలిపారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ సామాజిక మధ్యమాలలో నెహ్రూ గురించి 79 తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని, మహా పురుషులను గౌరవించే సాంప్రదాయమున్న మనదేశంలో తల్లితండ్రులను, మహిళలను అగౌరవ పరచడం అమానవీయమన్నారు. జవహర్ లాల్ నెహ్రూ కు షేక్ అబ్దుల్లా, మహారాజ హరిసింగ్ లతో గల సత్సంబంధాలతో నేడున్న జమ్మూ కాశ్మీర్ ను కాపాడుకోగలిగామన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ ఐఐటి, ఐఐఎం, ఇస్రో, ఎయిమ్స్ , సిఎస్ఐఆర్, డిఆర్డిఓ, ఆర్ ఈ సి లాంటి విద్య పరిశోధనా సంస్థలను, నాగార్జున సాగర్, హీరాకుడ్, భాక్రానంగల్ లాంటి బహులార్ధ సాధక నీటి ప్రాజెక్టులను, బిహెచ్ఈఎల్, ఐడిపిఎల్ , సెయిల్, కోల్ ఇండియా లాంటి పారిశ్రామిక సంస్థలను ప్రారంభించి అభివృద్ధి చేసి దేశం వేగంగా పయనించడానికి కారణ భూతుడైనాడని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ జవహర్ లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై 1929లో సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించాలనే తీర్మానాన్ని ఆమోదింప చేశారన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య ప్రసంగిస్తూ రాజ్యాంగ పరిషత్ నిర్మాణంలోనూ, రాజ్యాంగ రూపకల్పన లోను నెహ్రూ క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. రాజ్యాంగ పీఠికను రూపొందించడంలో, ఆదేశిక సూత్రాల రచనలో నెహ్రూది ముఖ్య భూమిక అన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి ప్రసంగిస్తూ స్వాతంత్ర్య ఉద్యమం సాంస్కృతిక జాతీయవాదం, ఉదార జాతీయవాదం, సోషలిస్ట్ జాతీయ వాదాలుగా కొనసాగిందన్నారు.

# తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణస్వీకారం

**సంగం, నవంబర్ 13:**

నూతనంగా ఎంపికైన తెలుగుదేశం పార్టీ మండల, క్లస్టర్ స్థాయి, యూనిట్స్ స్థాయి, గ్రామస్థాయి, బూత్ స్థాయి కార్యవర్గ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ముందుగా స్థానిక నేతలు తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పమాలతో ఘన నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో కార్యకర్తల ఆమోదంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఖరారు చేసిన పార్టీ బాధ్యులందరూ..తెలుగుదేశం పార్టీ ఆశయాలకు.. పవిత్ర లక్ష్యాలకు.. కట్టుబడి ఉంటూ క్రమశిక్షణతో ప్రజాసేవ భావంతో.. నిస్వార్ధంగా.. పార్టీ ఉజ్వల భవిత కోసం.. తమ కర్తవ్యాన్ని విధులను బాధ్యతగా నిర్వహిస్తామని ప్రమాణం చేశారు. తమను గుర్తించి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గారికి, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారికి, తమ అభిమాన నాయకుడు మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి గారికి..



సన్మానిస్తున్న దృశ్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు

ఈ సందర్భంగా ఎంపికైన నేతలంతా తమ కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ మండల పార్టీ కన్వీనర్ బాణ శ్రీనివాసులు రెడ్డి సమక్షంలో నేతలు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసుల యాదవ్. తెలుగుదేశం పార్టీ నాయకులు టాటా రవీంద్రారెడ్డి. తలుపురుపాడు సాగినీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు. జెండా దిబ్బ తెలుగుదేశం పార్టీ నాయకులు కంచర్ల నారాయణ. తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ అధ్యక్షులు మెట్టుకూరు విజయ్ కృష్ణారెడ్డి. తెలుగుదేశం పార్టీ నాయకులు కంచర్ల నరేష్ నాయుడు. పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ డా. వి వినోద్ కుమార్.. ఘనంగా బాపట్ల సర్దాం 150 ఐక్యత జిల్లా స్థాయి పాదయాత్ర..

# సర్దార్ పటేల్ సేవలు చిరస్మరణీయం

**బాపట్ల,నవంబర్ 13**


సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం అని కలెక్టర్ డా. వి వినోద్ కుమార్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ గుంటూరు గురువారం బాపట్ల లో సర్దార్ 150 ఐక్యత జిల్లా స్థాయి పాదయాత్ర కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా స్థానిక మునిసిపల్ హై స్కూల్ క్రీడా మైదానం వరకు పెద్ద ఎత్తున సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్,డి.ఆర్.ఓ జి. గంగాధర్ గౌడ్, బాపట్ల మునిసిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, బాపట్ల మండల తహసీల్దార్ సలీమా, మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి, బి.జె.పి జిల్లా అధ్యక్షుడు కె. బంగారు బాబు, బి.జె.పి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. రామకృష్ణ తదితర అతిధులు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చిత్ర పటానికి పూల మాలలతో ఘన నివాళులు అర్పించడంతో కారక్రమం ప్రారంభమైంది.కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ దేశ సమైక్యతా కోసం ధృడంగా నిలబడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన సమైక్య భారత్ నిర్మాతగా నిలిచిపోయారు అని అన్నారు. కలెక్టర్ డా. వి వినోద్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నం అన్నారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అని, ఆయన త్యాగం, కర్తవ్య నిబద్ధత, దృఢ సంకల్పం భారత యువతకు ప్రేరణ అన్నారు. బి.జె.పి జిల్లా అధ్యక్షుడు కె. బంగారు బాబు మాట్లాడుతూ వ్యక్తిగత ప్రాంతీయ ప్రయోజనాల కంటే దేశ సమైక్యతా గొప్పదని చాటి చెప్పిన సర్దార్ పటేల్ దార్శనికత గొప్పది అన్నారు. మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్ మై భారత్ గుంటూరు జిల్లా పరిపాలన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ ఐక్యత పాదయాత్రలో ఐ %ు% పి ఆర్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. వెంకట రమణ, బి.జె.పి బాపట్ల పి.ఓ.సి., ఎన్. శివనారాయణ , రేపల్లె, పి.ఓ.సి.మత్తి భాస్కరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం. సాధిక్, బాపట్ల జిల్లా ఎన్.ఎస్.ఎస్ నోడల్ ఆఫీసర్ జి. కళ్యాణి, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ అధికారి నిరంజన్, కె.వి. రామకృష్ణ, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ అధికారి, కె. కృష్ణ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి , ఆద్యంతం కోలాహలం గా ప్లకార్డ్ల ప్రదర్శన తో జరిగిన ఈ యూనిటీ మార్చ్ లో యువత విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా నినాదాలతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమం లో డా. బి ఆర్ అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద ఆత్మ నిర్భర్ భారత్ ప్రతిజ్ఞ చేశారు








# దర్శకత్వం వైపు రానా



నటుడు రానా తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు. తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి అభిప్రయాలు పంచుకున్నాడు. వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు. నటుడిగా, నిర్మాతగా, పంపిణీదారుడిగా సినిమా రంగం గురించి పూర్తి అవగాహన ఉన్న రానా మెగాఫోన్ పడితే చిరకాల కోరికను నెరవేర్చుకున్నవాడు అవుతాడు. రానా దర్శకత్వం వహించే సినిమాను ఓన్ బ్యానర్ లో చేస్తాడా? బయటి నిర్మాణ సంస్థలో చేస్తాడా అనేది తెలియాల్సి ఉంది. అలానే తాను డైరెక్ట్ చేసే సినిమాలో రానా నటిస్తాడా? లేకపోతే కేవలం దర్శకత్వానికే పరిమితం అవుతాడా? అన్నది చూడాలి.

# ధర్మేంద్ర ఇంటిముందు మీడియా




ఆగ్రహం వ్యక్తం చేసిన తనయుడు సన్నీ

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ మీడియాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన తన సహనాన్ని కోల్పోయి .. నోటి మాట జారారు. ముంబైలోని ఇంటి ముందు వేచి చూస్తున్న మీడియా, ఫోటోగ్రాఫర్లపై అసహనాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు ధర్మేంద్ర ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. బ్రీచ్ క్యాండీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ధర్మేంద్రకు ఇంటి వైద్యం అందిస్తున్నారు. అయితే కవరేజీకి వెళ్లిన మీడియా.. సన్నీ డియోల్ ఇంటి ముందే పడిగాపులు కాచింది. ఆ సమయంలో మీడియాను ఉద్దేశిస్తూ సన్నీ కాస్త ఆగ్రహానికి లోనయ్యాడు. చేతులు జోడించి మరీ సన్నీ డియోల్ మీడియాను తిట్టేశాడు. మీకు సిగ్గుగా అనిపించడం లేదా, మీకూ తల్లితండ్రులు, పిల్లలు లేరా, సిగ్గుగా ఎందుకు లేదని సన్నీ అన్నారు. ధర్మేంద్ర గురించి న్యూస్‌ను ప్రచురించే ఉద్దేశంతో కొన్ని రోజుల నుంచి ఫ్యామిలీ ఇంటి ముందే మీడియా ఎదురుచూస్తున్నది. దీంతో తీవ్ర ఫ్రస్టేషన్‌కు గురైన సన్నీ డియోల్ తనదైన స్టయిల్‌లో తన కోపాన్ని వ్యక్తం చేవ్చాడు. ప్రైవసీ ఇవ్వాలంటూ కోరాడు. సన్నీ ఆగ్రహానికి చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. సోషల్ మీడియాలో చాలా మంది యూజర్లు సన్నీకి మద్దతు తెలిపారు. డియోల్ ఫ్యామిలీ ప్రైవసీని మీడియా గౌరవించడం లేదని కొందరు యూజర్లు అన్నారు. ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆయన కూతురు ఈషా డియోల్ పేర్కొన్నారు.

# ఆహ్వానితులకు మాత్రమే ప్రవేశం

దర్శకుడు రాజమౌళి వీడియో ప్రకటన

ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఎసెస్ఎంబి సినిమాకు సంబంధించిన ఈవెంట్ ఉంటుందా ఉండదా? అనే చర్చ రెండు రోజులుగా జరుగుతోంది. వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టుకుని జియో హాట్ స్టార్ తో ఈ ఈవెంట్ ను రాజమౌళి బృందం ఎ÷-లాన్ చేసింది. నవంబర్ 15వ తేదీకి ఈ మూవీపై హైప్ పెంచుతూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ వస్తోంది. ఇప్పటికే శ్రుతీహాసన్ పాడిన పాటను రివీల్ చేసిన టీమ్, తాజాగా ప్రియాంక చోప్రా లుక్ ను సైతం విడుదల చేసింది. ఇదిలా ఉంటే... ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ నేపథ్యంలో గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ ఉండకపోవచ్చుననే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. దీనికి రాజమౌళి తెర దించారు. ఖచ్చితంగా ఈ వేడుక ఉంటుందని హామీ ఇచ్చారు. కాకపోతే... ఇది పబ్లిక్ ఫంక్షన్ కాదని, కేవలం ఆహ్వానితులకు మాత్రమే అక్కడ ప్రవేశం ఉంటుందని, రామోజీ ఫిల్మ్ సిటీకి ఎవరు ఏ మార్గం గుండా రావాల్సి ఉంటుందనే విషయంలో రాజమౌళి ఓ వీడియో ద్వారా వివరించారు. పోలీసు శాఖ విధించిన ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు రాజమౌళి తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్ద వారికి ఈ ఈవెంట్ లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. వారంతా జియో హాట్ స్టార్ లో చూసి ఆనందించవచ్చని చెప్పారు. రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గెట్ ను నవంబర్ 15వ తేదీ మూసి వేస్తున్నారని, దానికి ముందు, దాని తర్వాత ఉన్న మార్గాల ద్వారా ఈవెంట్ కు ఆహ్వానితులు రావాల్సి ఉంటుందని, వీలైనంత ముందుగా వస్తే మంచిదని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు క్రమశిక్షణతో మెలగకపోతే కార్యక్రమం రద్దు అయ్యే ఛాన్స్ కూడా ఉందని రాజమౌళి పరోక్షంగా హెచ్చరించారు. సో... మహేశ్ బాబు అభిమానులు, సినిమాను ప్రేమించే వారు ఏ రీతిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏ స్థాయిలో దీనిని విజయ వంతం చేస్తారో చూడాలి.




# మన శంకర్‌ప్రసాద్ గారు ఫైట్స్



చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది.ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది..
..............................................

# దేశంలో సగంమంది చంపాలను చూశారు




దకేరళ స్టోరీపై ఆదాశర్మ తాజా కామెంట్స్

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహోసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు' అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. 'పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుందని అదా శర్మ చెప్పారు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.